# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 100 | హైదరాబాద్ | శనివారం 04-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం... కీలక నిర్ణయాలు ఇవే!

## నేటి భారతం

- ఒక వ్యక్తిని అంచనావేయడంలోనే నీ వివేకం బయటపడుతుంది..
- ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు నాలుగు రకాలుగా మాట్లాడుతాడు.. నాలుగు విధాలుగా ప్రవర్తిస్తాడు..
- అదే బాధలో ఉన్నవాడు ఎంతో భావంతో మాట్లాడతాడు..
- ప్రేమతో జీవించేవాడు చనువుతో మాట్లాడతాడు..
- ఇక కోపంతో ఉన్నవాడు కేకలేస్తూ మాట్లాడతాడు..
- మంచివాడు మార్పుకోసం మాట్లాడతాడు..
- నీమీద అసూయతో ఉన్నవాడు నిన్నెప్పుడూ చులకనగా మాట్లాడతాడు..
- అదే జ్ఞానం ఉన్నవాడు మౌనంగా ఎంతో ఆలోచించి మాట్లాడతాడు..
- నిజానికి మాట మనిషిని మారుస్తుంది.. మౌనం మనసును మారుస్తుంది..
- నీ ఎదురుగా ఉన్నవారు ఎలాంటి వారో నువ్వు గమనించగలిగితే నీ మార్గం సుగమం అవుతుంది..
- ఇప్పటినుంచే ఎదుటివారిని
- అంచనా వేయడం నేర్చుకోండి.. అలవాటుగా మార్చుకోండి..

- కేసారం పెంటా రెడ్డి

దామోదర్ రెడ్డి భౌతికకాయానికి

# రేవంత్ రెడ్డి నివాళి



11లో

- రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దామోదర్ రెడ్డి మృతి
- జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం భౌతికకాయం
- రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకుల నివాళులు




న్యాయమైన విచారణలో

# న్యాయాధికారి పాత్ర..

- న్యాయాధికారి యొక్క ప్రాథమిక కర్తవ్యం ఏమిటి..?
- సామాన్యుడికి న్యాయం జరగాలంటే ఎలాంటి పరిస్థితులు ఉండాలి..?



12లో



# అమాయకుల ప్రాణాలు తీస్తున్న ధనదాహం..

12లో



- మెడికల్ మాఫియా చేస్తున్న క్లినికల్ ట్రయల్స్
- ఎలాంటి నిబంధనలు పాటించకుండా చేస్తున్న దుర్మార్గం
- వైద్య శాఖ నిద్రబోతూ అనుమతులు ఇస్తోందా?
- అనధికారంగా జరుగుతున్నా కట్టడి జరగడం లేదు
- క్లినికల్ ట్రయల్స్ ను దుర్వినియోగం చేస్తున్న కంపెనీలు
- అనవసరమైన మందుల వినియోగం జరుగుతోంది
- లాభాపేక్షతోనే చికిత్సలు చేస్తున్నట్టు తెలుస్తోంది
- ఈ పద్ధతికి చరమగీతం పడకపోతే భవిష్యత్ స్మశానంగా మారడం ఖాయం
- మెడికల్ మాఫియాకు ప్రభుత్వాల అండదండలు!
- క్లినికల్ ట్రయల్స్ పై నిఘా పెంచాలని డిమాండ్ చేస్తోంది ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ

# తెలంగాణలో మద్యం అమ్మకాల రికార్డు

రెండ్రోజుల్లో రూ. 419 కోట్ల అమ్మకాలు

- దసరా పండుగ వేళ రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు
- సెప్టెంబర్ 30న ఒక్కరోజే రూ. 333 కోట్ల మద్యం కొనుగోళ్లు
- గాంధీ జయంతి డ్రై డే కారణంగా ముందురోజే పోటెత్తిన జనం
- వివరాలు వెల్లడించిన తెలంగాణ ఎక్సైజ్ శాఖ



11లో

# ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది



11లో


- భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించిన బిల్ గేట్స్
- ఆవిష్కరణల రంగంలో ఇండియా ఓ గ్లోబల్ లీడర్ అని కితాబు
- 'వికసిత భారత్ 2047' లక్ష్యానికి మద్దతుగా ప్రకటన
- భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి మేలు చేస్తాయని వ్యాఖ్య
- అమెరికాలోని సియాటిల్‌లో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న గేట్స్

హైవేలపై..

# క్యూఆర్ కోడ్ బోర్డులు

**స్కాన్ చేస్తే పూర్తి సమాచారం మీ చేతిలో!**


- జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ బోర్డుల ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం
- స్కాన్ చేస్తే ప్రాజెక్ట్ వివరాలు, అత్యవసర నంబర్లు అందుబాటులోకి
- సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ బంకుల సమాచారం కూడా
- టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాల వద్ద ఈ బోర్డుల ఏర్పాటు



11లో

# తిరుపతిలో హై అలర్ట్..

రైల్వే స్టేషన్, బస్టాండులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



11లో

- చెన్నైలో సీఎం స్టాలిన్, నటి త్రిష నివాసాలు బాంబు బెదిరింపు కాల్స్
- తిరుపతిలోనూ పేలుళ్లు జరుపుతామంటూ ఈమెయిల్
- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- రంగంలోకి దిగిన బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు
- ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదని వెల్లడి
- భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్న పోలీసులు



11లో

# నాంపల్లిలో అలయ్ బలయ్

హాజరైన వెంకయ్య, కోమటిరెడ్డి, నాగార్జున, సుజనా చౌదరి

- దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో అలయ్ బలయ్
- హాజరైన తెలంగాణ గవర్నర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు
- అందరం కలిసి ఉండాలనేదే అలయ్ బలయ్ ఉద్దేశమన్న వెంకయ్యనాయుడు

# సంపాదకీయం

## భారత్‌లో పెరుగుతున్న విడాకులు..

భారత్‌లో విడాకుల ట్రెండ్ భారీగా పెరుగుతోందని ఓ సర్వేలో వెల్లడైంది. ఇక విడాకులు తీసుకున్న తర్వాత పురుషులు ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభంపై ఈ సర్వే సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చింది. ఇక విడాకుల ఖర్చులు, విడాకుల తర్వాత భరణం చెల్లింపుల కోసం 42 శాతం మంది పురుషులు అప్పులు చేస్తున్నారని వెల్లడైంది. అదే సమయంలో పురుషులు సంపాదించే సంపాదనలో ఏటా 38 శాతం సొమ్మును.. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ కింద చెల్లిస్తున్నారని ఈ సర్వేలో తేలింది. ఈ సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పురుషులపైనే పడుతోందని వెల్లడించిందిమన దేశంలో రోజురోజుకూ విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య అమాంతం పెరిగిపోతుండటం తీవ్ర సంచలనంగా మారుతోంది. అయితే విడాకులు అనేది కేవలం మానసిక వేదన మాత్రమే కాకుండా.. జీవితంలో ఎదురయ్యే అతిపెద్ద ఆర్థిక సంక్షోభం అని తాజాగా నిర్వహించిన ఒక కొత్త అధ్యయనం నిరూపించింది. భారతదేశంలోని టైర్ 1, టైర్ 2 నగరాల్లో విడాకులు తీసుకున్న కొంతమందిపై ఓ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో సంచలన విషయాలు బయటికి వచ్చాయి. విడాకుల తర్వాత ఒక పురుషుని ఆదాయంలో ఏడాదికి 38 శాతం భరణం , మెయింటెనెన్స్ వంటివి చెల్లించేందుకే ఖర్చు అవుతున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో 42 శాతం మంది వ్యక్తులు.. విడాకుల సమయంలో చెల్లించే భరణం కోసం రుణాలు తీసుకుంటున్నట్లు తేలిందిఫైనాన్స్ మ్యాగజైన్ అనే సంస్థ భారత్‌లోని టైర్ 1, టైర్ 2 వంటి నగరాలకు చెందిన 1,258 మందిపై నిర్వహించిన 2025 సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పూర్తిగా పురుషులపైనే పడుతోందని వెల్లడించింది. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ చెల్లించేందుకు.. పురుషులు తమ వార్షిక ఆదాయంలో సగటున 38 శాతం ఖర్చు చేస్తున్నట్లు ఈ సర్వే వివరించింది. దాదాపు 49 శాతం మంది పురుషులు విడాకులకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఇక ఇందులో మరో ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. 42 శాతం మంది పురుషులు భరణం చెల్లింపులు లేదా న్యాయ ప్రక్రియల కోసం రుణాలు తీసుకుంటున్నారని తెలిపింది.భరణం చెల్లించే పురుషుల్లో 29 శాతం మంది సెటిల్‌మెంట్ తర్వాత తమ ఆస్తుల నెట్ వర్త్ ప్రతికూలంగా మారిందని ఈ సర్వేలో వెల్లడించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ఇలాంటి విడాకుల ఖర్చులు ఉంటే.. ఆర్థికంగా చాలా సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోతారని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. విడాకులు తీసుకున్న పురుషుల్లో దాదాపు సగం మంది విడాకుల తర్వాత తమపై పడే ఆర్థిక భారాన్ని ముందుగా అంచనా వేయలేకపోతున్నారని ఈ సర్వే పేర్కొంది. కోర్టు ఫీజులు, లాయర్ ఖర్చులు, భరణం, పిల్లల నిర్వహణ ఖర్చులతో ఈ భారం భారీగా పెరుగుతోందని తెలిపింది.ఈ సర్వే పాల్గొన్న ఒక వ్యక్తి తన 7 ఏళ్ల న్యాయ పోరాటానికి సుమారు రూ.8-9 లక్షల వరకు ఖర్చు అయిందని.. దీనివల్ల మానసికంగా, ఆర్థికంగా తాను పూర్తిగా కుంగిపోయానని తెలిపారు. ఇటీవలి కాలంలో విడాకుల సమయంలో భరణం మొత్తాన్ని పెంచుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతున్నాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో మొత్తం విడాకుల రేటు దాదాపు 1 శాతం వద్ద తక్కువగానే ఉన్నప్పటికీ.. బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి పట్టణ ప్రాంతాల్లో గత కొన్నేళ్లలో విడాకుల కేసులు 30 నుంచి 40 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.బాంబే హైకోర్టు, ఫ్యామిలీ కోర్టులో లాయర్ అయిన అదితి మోహోని భార్యాభర్తల జీవితంలో వచ్చే ఆర్థిక నష్టాన్ని నివారించడానికి లేదా దాన్ని తగ్గించడానికి కొన్ని కీలక సూచనలు చేశారు. పెళ్లికి ముందు భార్యాభర్తలు ఇద్దరూ స్పష్టమైన ఆర్థిక నియమాలను ఏర్పరచుకోవాలని.. వాటిని డాక్యుమెంట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదాయాన్ని ఎలా పంచుకోవాలి అనేదానిపై నిర్ణయం తీసుకుని జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉంటే.. వారి పేరు మీద ఆస్తులు లేదా బీమాను సృష్టించాలని తెలిపారువిడాకుల సమయంలో ఆస్తులు, అప్పులు, ఆదాయం, భరణం, పిల్లల పోషణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, రికార్డుల కాపీలను భద్రపరుచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హక్కులను కాపాడుకోవడానికి, సాఫీగా మారడానికి ఫ్యామిలీ లాయర్ లేదా ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఆర్థిక విషయాల్లో భార్యాభర్తలిద్దరూ ముందే ఒక అభిప్రాయానికి వస్తే.. తర్వాత ఎదురయ్యే ఒత్తిడిని నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విడాకులకు సంబంధించిన న్యాయ ప్రక్రియలను ప్రారంభించడానికి ముందే కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడా డబ్బును సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇది లీగల్ ఫీజులు, అద్దె, రోజువారీ ఖర్చులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

# జనసేన పార్టీలో కీలక మార్పులు- నాగబాబు పదవి రామ్ తాళ్లూరికి

విజయవాడ, అక్టోబర్ 3 (భారత శక్తి)
జనసేన పార్టీ వ్యవహారాలను చూసే బాధ్యతలను రామ్ తాళ్లూరి కి అప్పగిస్తూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. రామ్ తాళ్లూరి ఇక నుంచి పార్టీ సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్వహిస్తారని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా రామ్ తాళ్లూరిని నియమించినట్లు అయింది. ఆయన పార్టీ అంతర్గత అంశాలను చూసుకుంటారని ప్రకటించారు. ఇప్పటి వరకూ ప్రధాన కార్యదర్శిగా నాగబాబు చూస్తున్న వ్యవహారాలు మొత్తం ఇక నుంచి రామ్ తాళ్లూరి చూస్తారు. ఇప్పటికే జనసేన పార్టీ ఐటీ విభాగాన్ని రామ్ తాళ్లూరినే చూసుకుంటున్నారు. నాగబాబు బాధ్యతలు కూడా ఆయనకే ఇస్తూ పవన్ నిర్ణయం తీసుకున్నారు. జనసేన పార్టీ స్థాపించినప్పటి నుండి ఆయన కలసి పని చేస్తున్నారు. తన నియామకంపై రామ్ తాళ్లూరి సంతోషం వ్యక్తం చేశారు. పవన్ ను మొదటిసారి కలిసిన రోజు నుంచి అదే ఉత్సాహం, ప్రజల కోసం అంకితభావం కొనసాగుతోందన్నారు. పార్టీ వ్యవహారాల కోసం నాగబాబు ఎక్కువ సమయం కేటాయించలేకపోవడం .. ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణించాలని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నారు. ఈ నియామకం అందుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నారు. రామ్ తాళ్లూరి ఖమ్మంజిల్లాకు చెందిన ఎన్నారై. సినిమాలు కూడా నిర్మించారు. పవన్ కల్యాణ్‌కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందారు. రామ్ తాళ్లూరి అమెరికాలో లీడ్ ఐటీ కార్ప్ , ఫ్లై జోన్ ట్రాంపోలిన్ పార్క్, రామ్ ఇన్నోవేషన్స్ (రియల్ ఎస్టేట్) వంటి వ్యాపారాలను నడుపుతున్నారు. సినిమా రంగంలో రాఖీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సినిమాలు నిర్మించారు.



**పిఠాపురం జనసేనలో మర్రెడ్డి శ్రీనివాసరావు మార్పు తప్పదా?**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఇంచార్జ్ ఎవ్వరు అనేదానిపై పెద్ద డౌట్ వ్యక్తం అవుతోంది.. ఎందుకంటే పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తోన్న మర్రెడ్డి శ్రీనివాసరావును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా జోరుగా సాగడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.. స్థానికంగా ఆయనపై పార్టీలో ఉన్న అసంతృప్తే ఆయన పెద్దగా చురుగ్గా ఉండడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.. అయితే ఆయనకు పార్టీ అధినేత నుంచి పుష్కలంగా ఆశీస్సులు ఉండడం, ఆయనపై అధిష్టానానికి సానుకూలత ఉండడంతో ఆయన ముందుండి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. అయితే గత కొంత కాలంగా ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌పై వస్తున్న పుకార్ల ఈనేపథ్యంలోనే ఇటీవల నియోజకవర్గంలో పర్యటించిన జనసేన ముఖ్యనేత, ఎమ్మెల్సీ హరిప్రసాద్ విలేకరులు అడిగిన ప్రశ్నకు షాకింగ్ సమాధానం ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీలో ముందునుంచి అన్నీతామే వ్యవహరించిన వారిని పక్కన పెట్టారని, కొత్తగా వైసీపీలో నుంచి, ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారిని పార్టీలో ప్రాముఖ్యత ఇస్తున్నారని ముందునుంచి కొంత మందిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పలు సందర్భాల్లో బట్టబయల?ంది.. ఇది చేబ్రోలు సీతారామాలయంలోని జే గంట విషయంలో బయటపడింది. అయితే ఇటువంటి సందర్భాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, లేక ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఇలా ఎవరో ఒక నేతలు వచ్చి సర్ధి చెప్పడం పరిపాటిగా మారింది..ఇక్కడ విషయాలన్నీ జనసేనాని దృష్టికి వెళ్లడం లేదని, తమ గోడు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదని చాలా మంది జనసేన పార్టీ నేతలే లోలోన మధనపడిన పరిస్థితులున్నాయని విశ్వసనీయంగా తెలుస్తోంది..దీనికి తోడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థానికంగా లేకపోవడం, ఆయన ఏదైనా సమావేశాలుంటేనే హాజరయ్యే పరిస్థితి ఉండడం తమ ఇబ్బందులను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని జనసేన నేతలు వాపోయిన పరిస్థితి కూడా కనిపించింది.. ఈనేపథ్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ మార్పు జరిగనుందా..? అందుకే నియోజకవర్గంలో ఈరకమైన వార్తలు హల్‌చల్ చేస్తున్నాయన్న

# అమరావతికి హైస్పీడ్ కారిడార్..

## కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా నిర్మాణం

విజయవాడ, అక్టోబర్ 3 (భారత శక్తి)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే



ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా- చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చుతుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తున్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్-చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్

కాకినాడ అక్టోబర్ 3 (భారత శక్తి)
ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే.ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది.వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వాటాల



సమస్యలు తేలక పోవడం వల్ల రిజిస్ట్రేషన్లు ముందుకు సాగలేదు. భూమి బదలాయింపు కాకపోవడంతో చాలామందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదు. రైతు భరోసా వంటివి వర్తింపు కావడం లేదు. బ్యాంకు రుణాలు లభించడం లేదు. అవసరానికి భూమి విక్రయించేందుకు అవకాశం లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం అమలయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం కలగనుంది.అయితే సచివాలయాల్లో వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అక్కడ సిబ్బందికి శిక్షణ, కంప్యూటర్లు, పరికరాలు అవసరం అవుతాయి. అయితే వారానికి ఒకటి రెండు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది. అయితే సచివాలయాల్లోన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు భారీగా ఖర్చు కానుంది. ప్రజలకు సులభతరం చేసే పనిలో భాగంగా ప్రభుత్వంపై ఇప్పుడు ఆర్థిక భారం పడనుంది. అందుకే దీనిపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. కానీ గత ఏడాదిలో భారీగా వచ్చిన ఫిర్యాదులతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే గ్రామ సచివాలయాల్లో ఈ రిజిస్ట్రేషన్ ఎంత వరకు విజయవంతం అవుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

# వైసీపీ యూ టర్న్



గుంటూరు, అక్టోబర్ 3 (భారత శక్తి)
ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, విపక్ష వర్గాలుగా విడిపోయి వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అసలు పార్టీ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లో అంచనా వేసుకోవడానికి కూడా ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని జగన్ భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే లోపు జిల్లా, నియోజకవర్గ, బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసే పనిలో ఉండాలని నేతలకు జగన్ ఆదేశించారట. ఈ ఎన్నికల తర్వాత పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా వెంటనే దానికి స్పందన భారీగా వచ్చే అవకాశముందన్న అంచనాల్లో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు.

# తీరం దాటిన తీవ్రవాయుగుండం

విశాఖపట్నం , అక్టోబర్ 3 (భారత శక్తి)
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిశా గోపాల్ పూర్ సమీపంలో తీరం దాటింది. ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ బలహీనపడుతోంది. తీరం దాటిన కోస్తా జిల్లాలపై వాయుగుండం ప్రభావం కొనసాగనుంది. శుక్రవారం ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు అధికారులు జారీ చేసారు. విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసారు.

# బెంగళూరు దాటని జగన్



కడప,అక్టోబర్ 3 (భారత శక్తి)
వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయం అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. కానీ ఆయన క్షేత్రస్థాయిలో చేస్తున్న ప్రయత్నాలలో చాలా రకాల లోపాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన రాష్ట్రంలో ఉండడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది మొదలు ఆయన ఎక్కువగా బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అక్కడ నుంచి తాడేపల్లి కి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రారంభంలో వారంలో నాలుగు రోజులు పాటు తాడేపల్లిలో ఉండేవారు. అయితే అది క్రమేపి రెండు రోజులకు పడిపోయింది. ఒక్కోసారి తాడేపల్లి కి కనిపించకుండా కూడా మానేశారు. అయితే గతంలో ఇదే జగన్మోహన్ రెడ్డి అండ్ వైసీపీ శిబిరం చంద్రబాబుపై తరచూ ఒక ఆరోపణ చేసేది. చంద్రబాబుతో పాటు లోకేష్ హైదరాబాదులో ఉండి మాట్లాడుతున్నారని ఆరోపించేవారు. ఇప్పుడు అదే పని జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారు. అయితే టిడిపి కూటమి నేతలు ప్రశ్నించడం లేదు కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులే దీనిపై ఎక్కువగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాయి.వారం రోజుల కిందట జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ప్రారంభించారు. ఎక్కడైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కూటమి నుంచి ఇబ్బందులు ఎదురైతే.. డిజిటల్ బుక్ లో వివరాలు నమోదు చేసుకోవాలని.. అధికారంలోకి వస్తే వారందరినీ సప్త సముద్రాలు అవతల ఉన్న తెచ్చి చర్యలు తీసుకుంటామని జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. అయితే ఆ డిజిటల్ బుక్ ను తెరిచి పార్టీ కార్యకర్తలకు చూపించి బెంగళూరు వెళ్ళిపోయారు. తరువాత ఆ డిజిటల్ బుక్ వ్యవహారం అనేది ఏంటి? ఎలా తీసుకెళ్లాలి? అనేది మాత్రం వివరించే ప్రయత్నం చేయలేదు. అసలు ఈ వారం బెంగళూరు నుంచి తాడేపల్లి కి రాలేదు. అటు నుంచి అటే యూరప్ పర్యటనకు వెళ్లనున్నారు జగన్మోహన్ రెడ్డి దంపతులు. అంటే మరో నెల రోజుల పాటు జగన్మోహన్ రెడ్డి అందుబాటులో ఉండరన్నమాట.అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి విడిచి బయటకు వెళ్లేవారు కాదు జగన్మోహన్ రెడ్డి. బెంగళూరు ముఖం కూడా చూసేవారు కాదు. కానీ ఇప్పుడు బెంగళూరును పట్టుకొని వేలాడుతున్నారు. అక్కడే ఎలహంక ప్యాలెస్ లో ఎక్కువగా విడిది చేస్తున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్నప్పుడు జిల్లాల పర్యటన కూడా చేసేవారు కాదు. ప్రతిపక్షంలోకి వచ్చాక చేస్తామని చెప్పారు.
కానీ తాడేపల్లికి వచ్చి ప్రెస్ మీట్ లు పెడుతున్నారు. చంద్రబాబును తిట్టడానికి పరిమితం అవుతున్నారు. ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను ప్రస్తావించే సాహసం చేయడం లేదు. ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదు. జగన్మోహన్ రెడ్డి ఈ తరహా ప్రదర్శన, దూకుడుతో కూటమిని అడ్డుకోలేరని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# ఏపీకి వాయుగండం

విశాఖపట్టణం, కాకినాడ అక్టోబరు 3, (భారత శక్తి)
ఏపీకి భారీ వర్ష సూచన. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే రాయలసీమలో వర్షాలు దంచి కొడుతున్నాయి. తాజాగా ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో అతి భారీ వర్షాలు పడనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తాజాగా అల్పపీడనం ఏర్పడింది. ఇది తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఈ తెల్లవారుజామున 6 గంటల సమయానికి విశాఖకు 300, ఒడిస్సా లోని గోపాల్పూర్ కు 310, పారాదీప్ నకు 400 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. గంటకు పది కిలోమీటర్ల వేగంతో ఇది తీరం



వైపు కదులుతోంది. నేటి రాత్రికి గోపాల్ పూర్- పారాదీప్ మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిస్సా తీరాల మధ్య దాటి అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది.వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయి. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షపాతం నమోదు కానుంది. మిగతా జిల్లాల్లో మాత్రం తేలికపాటి వానలు కొనసాగునున్నాయి.వాయుగుండం తీరం దాటే క్రమంలో భారీ ఈదురుగాలులు కొనసాగనున్నాయి. గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. శనివారం వరకు మత్స్యకారులు చేపల వేట కోసం వెళ్లకూడదని అధికారులు సూచించారు. మరోవైపు చాలా జిల్లాల్లో పిడుగుల వాన పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీచేస్తోంది. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. కాగా వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో కుండపోతగా వర్షం పడుతోంది. ఈ రాత్రికి వాయుగుండం తీరం దాటనుండడంతో విస్తారంగా వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది.

## ప్రముఖ రచయిత
# లల్లాదేవి కన్నుమూత

లల్లాదేవి గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ రచయిత పరుచూరి నారాయణాచార్యులు కన్నుమూశారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. గతకొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి రెండు గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. 1980వ దశకంలో మంచి పాపులారిటీ ఉన్న రచయితలలో లల్లాదేవి కూడా ఒకరు. పాములపై పరిశోధన చేసిన ఏకైక రచయితగా ఆయనకు పేరు. పలు తెలుగు సినిమాలకు కూడా రచయితగా ఆయన పనిచేశారు. 2004లో విడుదలైన శ్వేత నాగు చిత్రానికి కథా రచయిత లల్లాదేవే. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకి ఆయన అత్యంత సన్నిహితులు. కొంతకాలం ఆయన దగ్గర కార్యదర్శిగా కూడా లల్లాదేవి పనిచేశారు. వారి మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియ చేశారు. వారి స్వగ్రామం గుంటూరు జిల్లా పత్తిపాడు సమీపంలోని నిమ్మగడ్డవారిపాలెం. ఇప్పటి వరకు ఆయన దాదాపు 250 పై చిలుకు నవలలు రాశారు. కొన్ని వందల కథలు, నాటికలు, నాటకాలు కూడా రాశారు. ప్రముఖ దిన, వార పత్రికలలో సీరియల్ గా కూడా ప్రచురితమయ్యాయి.



## చార్మినార్ నీడలో
# గంజాయి బ్యాచ్ ఆగడాలు..
### అడ్డొస్తే దాడులు.. పోలీసన్నలు జర చూడండి..

హైదరాబాద్, అక్టోబర్ 3 (భారత శక్తి)
హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. గంజా తాగి.. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు



వసూలు చేస్తూ రెచ్చిపో తున్నారు. హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తూ.. రెచ్చిపోతున్నారు. ఈ బ్యాచ్‌లు తమకు మామూలు డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేయడం, పదేపదే బెదిరించడం, రోజూ వచ్చి వసూళ్లకు పాల్పడటం సర్వసాధారణంగా మారింది. పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల చిరు వ్యాపారులు.. ఈ గంజాయి బ్యాచ్‌ల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రోజంతా కష్టపడి అమ్మితే వచ్చేది అంతంతమాత్రమే అని, దాన్ని కూడా గంజాయి బ్యాచ్ బెదిరించి లాక్కుంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి రక్షించాలని కోరుతున్నారు. చార్మినార్ ప్రాంతం ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కావడంతో అక్కడికి వచ్చే పర్యాటకులు కూడా ఈ గంజాయి బ్యాచ్‌ల వేధింపులకు గురవుతున్నారు. వారి ఎదుటే రోడ్లపై గంజాయి బ్యాచ్‌లు రౌడీలుగా ప్రవర్తించడంతోపాటు.. పలు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని.. వసూళ్ల కోసం గుంపులుగా కూర్చుంటున్నారు. దీంతో పర్యాటకులు భయంతో అక్కడ నిలబడలేకపోతున్నారు.ఇలాంటి వారితో చార్మినార్ పర్యాటక రంగం కూడా దెబ్బతింటోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనలు పర్యాటకులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా చిరు వ్యాపారులకు కూడా నష్టం తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గంజాయి వినియోగాన్ని అరికట్టడంతో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలంటున్నారు.

# 11 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి కసరత్తు

అమరావతి, అక్టోబర్ 3 (భారత శక్తి)
ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు పోలీసు శాఖ మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాల భర్తీకి ఆ శాఖ కసరత్తు




ప్రారంభించింది. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్పీ, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వుసీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో ఉన్న ఉద్యోగాలు ఫిల్ చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించారు డీజీపీ. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లు రిలీజ్ చేయనున్నారు. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ పోస్టులు,2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల భర్తీకి అనుమతి ఇవ్వాలని డీజీపీ కార్యాలయం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.
ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఏపీ స్టేట్‌లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఈ ఉద్యోగాలను భర్తీకి నోటిఫికేషన్ ఇస్తారు. ఇంకా వివరణాత్మకంగా చూస్తే...

| పోస్టు పేరు | ఖాళీల సంఖ్య |
|---|---|
| ఎస్ఐ(సివిల్) | 182 |
| రిజర్వ్ ఎస్ఐ(ఏఆర్) | 116 |
| రిజర్వ్ ఎస్ఐ (ఎస్ఏఆర్-సీపీఎల్) | 18 |
| రిజర్వ్ ఎస్(ఐఏపీఎస్పీ) | 53 |
| ఎస్ఐ(కమ్యూనికేషన్) | 61 |
| ఎస్ఐ(పీటీఓ) | 14 |
| సివిల్ పోలీస్ కానిస్టేబుల్ఉద్యోగాలు | 3622 |
| ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ | 2000 |
| ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్(డ్రైవర్) | 198 |
| పోలీస్ కానిస్టేబుల్(కమ్యూనికేషన్) | 298 |

ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీవరకు వివిధ విభాగాల్లో గుర్తించిన ఖాళీలను మాత్రమే పంపించారు. నేరస్తులు కొత్త కొత్త విధానాల్లో క్రైం చేస్తున్నారు
సైబర్ క్రైం పెరిగిపోతోంది. రాష్ట్రంలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేయాలంటే సిబ్బంది అవసరం అని పోలీసు శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.
ఈ ఉద్యోగాల భర్తీకి వీలైనంత త్వరగా అనుమతి ఇచ్చి నోటిఫికేషన్ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సూచించింది.

## దేవరగట్టు బన్నీ
# ఉత్సవంలో తీవ్ర విషాదం

### దేవరగట్టు బన్ని ఉత్సవంలో ఇద్దరు మృతి.. 100 మందికి గాయాలు

కర్నూలు అక్టోబర్ 3 (భారత శక్తి)
హ్వాళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని జైత్రయాత్రలో హింస చెలరేగింది. కర్రల సమరంలో ఇద్దరు బలి అయ్యారు. వంద మందికి పైగా గాయాలు అయ్యాయి. మృతులు అరికెరికి చెందిన తిమ్మప్ప, కర్ణాటకకు చెందిన బసవరాజు. గాయపడ్డ వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా వుంది. బాధితులకు ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మాళమల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను దక్కించుకునేందుకు పోటీ లో ఈ ఘటన జరిగింది. బన్నీ ఉత్సవానికి రెండు లక్షల మంది తరలివచ్చారు. కర్రలతో కొట్టుకొనే క్రమంలో తీవ్ర గాయాలపాలై మరణాలు సంభవించాయి.

# మన్యం జిల్లాలో ప్రకృతి బీభత్సం



విశాఖ అక్టోబరు 3,
పార్వతీపురం మన్యం జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒడిశా-ఆంధ్ర సరిహద్దుల్లోని కొఠియా గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగాయి. విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో వరద బీభత్సంకొనసాగుతోంది. చంపావతి నది పొంగి ప్రవహిస్తుంది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# 26 నుంచి చైనాకు విమాన సర్వీసులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (భారత శక్తి)
కోవిడ్-19 , గల్వాన్ లోయలో సైనికుల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా ఐదేళ్లుగా నిలిచిపోయిన భారత్-చైనా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2న భారత విదేశాంగ శాఖ ఈ ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి విమాన సేవలు మొదలవుతాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్నాయి. పర్యాటకం, వాణిజ్యం, వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యం. ఇండిగో కోల్‌కతా-గ్వాంగ్జూ సర్వీసులను ప్రకటించింది.కరోనా వైరస్ వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్, చైనాల మధ్య ఐదేళ్లుగా నిలిచిపోయిన విమాన సర్వీసులు.. పునఃప్రారంభం కానున్నాయి. ఇరు దేశాల మధ్య ఈ అంశంపై పలు దఫాలుగా చర్చలు జరిగాయి. తాజాగా డైరెక్ట్ విమానాల పునఃప్రారంభానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్టు భారత విదేశాంగశాఖ అక్టోబరు 2న ప్రకటించింది. వింటర్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకొని.. ఈ నెల చివర నాటికి వివిధ నగరాల మధ్య విమాన సర్వీసులు పునఃప్రారంభించేందుకు భారత్, చైనాలకు చెందిన ఎయిర్‌లైన్స్ ఏర్పాట్లు చేసుకుంటాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇరు దేశాల పౌరవిమానయాన అధికారుల మధ్య సాంకేతికస్థాయి చర్చలు జరిగినట్టు తెలిపింది. దీంతో అక్టోబరు 26 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.మధ్య సరిహద్దుల్లో ఐదేళ్ల నుంచి నెలకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. కానీ, ప్రధాని నరేంద్ర మోదీ- చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్‌లు, ఇరు దేశాల విదేశాంగ శాఖ అధికారుల మధ్య జరిగిన భేటీల్లో దీనిపై ప్రధానంగా చర్చించారు.. గత కొద్ది నెలలుగా భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. ఆగస్టులో షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం ప్రధాని చైనా వెళ్లినప్పుడు విమాన సేవల పునఃప్రారంభానికి సూత్రప్రాయంగా అంగీకరించాయి. తాజాగా, అవగాహనకు రావడంతో ఐదేళ్ల తర్వాత భారత్, చైనాల మధ్య నేరుగా విమాన సర్వీసులు మొదలుకానున్నాయి.ఇక, విదేశాంగ శాఖ ప్రకటన వెలువడిన కాసేపటికే చైనాకు విమాన సర్వీసుల పునఃప్రారంభంపై ప్రముఖ ఎయిర్‌లైన్స్ ఇండిగో ప్రకటన చేసింది. కోల్‌కతా నుంచి గ్వాంగ్జూ మధ్య అక్టోబరు 26 నుంచి రోజూ నాన్-స్టాప్ సర్వీసులు నడుస్తాయని తెలిపింది. డీజీసీఏ నిబంధనలకు లోబడి ఢిల్లీ-గ్వాంగ్జూ విమానాలను త్వరలోనే నడుపుతామని పేర్కొంది.ఇరు దేశాల మధ్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, సరిహద్దు వాణిజ్యం, వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్య మార్గాల పునఃస్థాపనలో భాగంగా ఇండిగో తన ఎయిర్‌బస్ ఎ320 నియో విమానాలను ఉపయోగిస్తుందని తెలిపింది. ఇరుదేశాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు నిలిచిపోవడంతో వ్యాపార, పర్యటక, విద్యా రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. దౌత్యపరమైన సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఈ ప్రకటన ఉద్రిక్తతల తగ్గుముఖం పట్టడానికి సంకేతంగా భావిస్తున్నారు. అమెరికా-భారత్ వాణిజ్య చర్చలు, డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. ఎస్‌సీఓ భేటీ అనంతరం మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ఆ తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, మోదీ, జిన్‌పింగ్‌లు కలిసి ఫోటోలు దిగారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కసువెళ్లగక్కడం గమనార్హం.



# పాతకాపుకే కమలం టిక్కెట్



హైదరాబాద్, అక్టోబర్ 3 (భారత శక్తి)
హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బై పోల్ కోసం అన్ని రాజకీయ పార్టీల కుస్తీ పడుతున్నాయి. కాషాయం పార్టీ సైతం కసరత్తు స్పీడప్ చేసింది. ఇప్పటికే కమిటీలు వేసి కాలనీల్లో బూత్ మీటింగ్స్ నడిపిస్తోంది. మానిటరింగ్ కమిటీతో పార్టీ చీఫ్ రాంచందర్ రావు ప్రత్యేక సమావేశం నిర్వహించి.. ప్రస్తుతం ప్రచార వ్యూహాలు, టికెట్ రేసులో ఉన్నవారి పేర్లపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇంతకీ బీజేపీ లేటెస్ట్ జూబ్లీహిల్స్ రూట్ మ్యాప్ ఎంటో తెలుసుకుందాం.గ్రేటర్ హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక కోసం భారతీయ జనతా పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, గరికపాటి మోహన్ రావు, చింతల రామచంద్రా రెడ్డి, గౌతంరావులతో బై పోల్ కి మానిటరింగ్ కమిటీ వేసింది అధిష్టానం. నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు పార్టీ తరుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బూత్ లెవల్ కమిటీలను ఏర్పాటు చేసుకుని చాపకింద నీరులా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాషాయ దళం క్యాంపెయినింగ్ కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, ఇక ముందు అనుసరించాల్సిన వ్యూహాలపై మానిటరింగ్ కమిటీతో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావు అత్యవసర భేటి అయ్యారు. బూత్ లెవల్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యేలా కార్యక్రమా?ల చేపట్టాలని సూచించారు.జూబ్లీహిల్స్ ఓటర్ నాడీ తెలుసుకుని అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచించుకుంటున్నారు. ముఖ్యంగా బీజేపీ తరపున అభ్యర్థి ఎవరన్నదానిపై పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. టికెట్ కావాలంటూ ఇప్పటి వరకు రాష్ట్ర నాయకత్వానికి వచ్చిన వినతులపైనా చర్చించినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి తనకే మళ్లీ అవకాశం ఉంటుందన్న గట్టి ధీమాతో ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అన్ని కార్యక్రమాలు నియోజకవర్గంలో ఆయనే చూసుకుంటున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సపోర్ట్ తనకే ఉంటుందని, టికెట్ పక్కా లంకలకే అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.మరోవైపు జూబ్లీహిల్స్ బీజేపీ టికెట్ రేసులో లంకల దీపక్ రెడ్డి తర్వాత బలంగా వినిపిస్తున్న పేర్లు కీర్తి రెడ్డి, ఆకుల విజయ, వీరపనేని పద్మ. ఈ ముగ్గురు మహిళా కోటాలో తమకు అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారు. కీర్తిరెడ్డి గతంలోనూ జూబ్లీహిల్స్ టికెట్ ఆశించారు. కిషన్ రెడ్డి అనుచర వర్గం కావడం, ఆర్థికంగా బలంగా ఉండటం, మహిళా కేటగిరీ ఆమెకి కలిసి వస్తుందని అనుకుంటున్నారు.

ఇప్పటికే ఆమె తన మనసులోని మాట రాష్ట్ర నాయకత్వం ముందు పెట్టినట్లు తెలుస్తోంది.టికెట్ ఆశిస్తున్న మరో మహిళా నేత ఆకుల విజయ. రాష్ట్రంలో బీసీ చుట్టే రాజకీయం నడుస్తున్న వేళ జూబ్లీహిల్స్‌లో బీసీలకు అవకాశం ఇవ్వాలనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఆకుల విజయ బీసీ మహిళ. గతంలో మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేయడం, రాష్ట్ర నేతల్లో కొద్దిమంది మద్దతు ఉండటంతో టికెట్ ఇస్తారన్న ఆశలు పెట్టుకున్నారు. అధికార కాంగ్రెస్ బీసీని బరిలోకి దించాలని చూస్తోందని.. బీజేపీ నుంచి కూడా బీసీనైన తనకు సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. మరో బీజేపీ మహిళా నేత వీరపనేని పద్మ కూడా టికెట్ ఇస్తే పోటీ చేస్తానంటూ రిక్వెస్ట్ పెట్టుకున్నారు.మొత్తంగా ఓ వైపు జూబ్లీహిల్స్ లో గెలుపుకోసం వ్యూహాలు రచిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమలం పార్టీ.. గెలుపు గుర్రంగా ఎవరిని బరిలోకి దించుతుందన్న ఆసక్తి కంటిన్యూ అవుతోంది..!

## ఒకే దెబ్బకు రెండు... బీఆర్ఎస్ స్థానిక వ్యూహమిదే

హైదరాబాద్, అక్టోబర్ 3 (భారత శక్తి)
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తన సత్తాను చాటాలని యోచిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని తమను తెలంగాణలో ఎవరూ తుడిచిపెట్టడానికి ప్రయత్నించలేరన్న బలమైన సంకేతాలను ఇవ్వనుంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరుగుతాయి. అదే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మాత్రం పార్టీ గుర్తుతోనే జరగనున్నాయి. దీంతో పల్లె, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరపతి ఏ మాత్రం తగ్గలేదని నిరూపించుకోవడానికి కేటీఆర్ సిద్ధమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపలేవన్నది జనానికి తెలియజేయాలని భావిస్తున్నారు. తన సోదరి కల్వకుంట్ల కవిత పార్టీ నేతలపై విమర్శలు చేయడంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కవిత ప్రభావం ఈ ఎన్నికల్లో ఉండకుండా ఉండేలా చూసుకోవాలని నేతలకు కేటీఆర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ ఈ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతా తానే అయి లోకల్ ఎన్నికలను ఎదుర్కొనాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి ప్రచారం వరకూ నేతలను సమన్వయం చేసుకుంటూ వెళతానని, పార్టీ కోసం గత రెండేళ్లుగా పార్టీ కోసం బాగా పనిచేస్తున్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాలని నేతలను ఆదేశించారు.మరొకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా అవలంబిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ కు అనుకూలంగా మారేలా నేతలు వ్యవహరించాలని కేటీఆర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే కొన్ని సీట్లు అత్యధికంగా గెలిచి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఏంటో చెప్పాలని కేటీఆర్ నేతలకు సూచించారు. తాను జిల్లాల వారీగా పర్యటిస్తానని, మరికొన్ని జిల్లాల్లో హరీశ్ రావు కూడా పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరుపై బాకీ కార్డును కేటీఆర్ విడుదల చేశారు. ఈ బాకీ కార్డు ప్రతి ఇంటికి చేరేలా చూడాలని కేటీఆర్ నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలతో ఇటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అటు కవితను దెబ్బతీసి పార్టీ క్షేత్ర స్థాయిలో బలంగా ఉందన్న విషయాన్ని తెలియజెప్పేలా వ్యవహరించాలని కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు

## పొద్దు తిరుగుడు విత్తనాలు తినడం వాళ్ళ అనేక లాబాలు

హైదరాబాద్ అక్టోబర్ 3 (భారత శక్తి) ;సాయంత్రం సమయంలో చాలా మంది చిరుతిళ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. బయట రహదారుల పక్కన బండ్లపై లేదా ఫుడ్ కోర్టులు వంటి వాటిల్లో సమోసాలు, బజ్జీలు, పునుగులతోపాటు బేకరీలలో వివిధ రకాల ఆహారాలను సాయంత్రం సమయంలో స్నాక్స్ లా తింటుంటారు. అయితే ఇవి మన ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేలా చేస్తాయి. కనుక ఈ ఆహారాలను తినకూడదు. సాయంత్రం సమయంలో ఆకలి అయితే ఆరోగ్యవంతమైన స్నాక్స్‌ను తినాల్సి ఉంటుంది. ఇవి ఆకలిని తీర్చడమే కాదు, మనకు పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇక అలాంటి ఆరోగ్యవంతమైన స్నాక్స్‌లో పొద్దు తిరుగుడు విత్తనాలు కూడా ఒకటి. చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

హైబీపీ తగ్గేందుకు..

పొద్దు తిరుగుడు విత్తనాల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులతోపాటు ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఈ విత్తనాలను తింటే మెదడు పనితీరు మెరుగు పడుతుంది. కణాల నిర్మాణం సరిగ్గా జరుగుతుంది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ కొవ్వులతోపాటు ఈ విత్తనాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు ఎంతో మేలు చేస్తాయి. ఇవి మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. బీపీ తగ్గేలా చేస్తాయి. ఈ విత్తనాల్లో ఉండే మెగ్నిషియం గుండె వేగంగా కొట్టుకోవడాన్ని తగ్గిస్తుంది. దీంతో హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి..

పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కారణంగా మనం తినే ఆహారాల్లో ఉండే పిండి పదార్థాలు రక్తంలో గ్లూకోజ్‌గా నెమ్మదిగా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ అమాంతం పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ఈ విత్తనాల్లో జింక్, సెలీనియం, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలు రాకుండా ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఈ విత్తనాల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి ఈ విత్తనాలను చక్కని ఆహారంగా చెప్పవచ్చు. ఈ విత్తనాలను తింటే ప్రోటీన్లు లభించి శరీరానికి శక్తి అందుతుంది. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గిపోతాయి.

ఎలా తినాలి..?


గుప్పెడు పొద్దు తిరుగుడు విత్తనాలను తింటే సుమారుగా 165 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 5.5 గ్రాములు, కొవ్వులు 14.4 గ్రాములు, పిండి పదార్థాలు 6.5 గ్రాములు, ఫైబర్ 3 గ్రాములు ఉంటాయి. అలాగే విటమిన్ ఇ, మెగ్నిషియం, సెలీనియం, జింక్, కాపర్ కూడా ఈ విత్తనాల్లో అధిక మొత్తాల్లో ఉంటాయి. పొద్దు తిరుగుడు విత్తనాలను గుప్పెడు మోతాదులో తినవచ్చు. అధికంగా తింటే వికారం, వాంతికి వచ్చినట్లు అనిపించడం, పొట్టలో అసౌకర్యంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ విత్తనాలను నేరుగా తింటే వికారంగా అనిపిస్తుంది. కనుక పెనంపై కాస్త వేయించి తింటే మంచిది. పొద్దు తిరుగుడు విత్తనాలను సాయంత్రం సమయంలో స్నాక్స్‌లా తినవచ్చు. లేదా రాత్రి నిద్రకు ముందు తినవచ్చు. ఉదయం వ్యాయామం చేసిన తరువాత కూడా తినవచ్చు.

## సినిమా హబ్‌లో మల్టీప్లెక్స్‌ల హడావిడి..

హైదరాబాద్,అక్టోబర్ 3 (భారత శక్తి)
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా లవర్స్‌కు శుభవార్త. దశాబ్దాలుగా సింగిల్ స్క్రీన్‌లకు కేంద్రమైన ఈ ప్రాంతంలో ఇప్పుడు రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. ఓడియన్ మల్టీప్లెక్స్ (8 స్క్రీన్‌లు) అక్టోబర్ 24, 2025న.. ఆ తర్వాత సంక్రాంతి 2026కి ఏఎంబీ క్లాసిక్ (7 స్క్రీన్‌లు) ప్రారంభమవుతాయి. మహేష్ బాబు భాగస్వామ్యంతో వస్తున్న ఏఎంబీ క్లాసిక్, సుదర్శన్ థియేటర్ స్థానంలో రూపుదిద్దుకుంది. ఈ కొత్త మల్టీప్లెక్స్‌లతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఇక 25 స్క్రీన్‌ల వినోద కేంద్రంగా మారుతుంది.మూవీ లవర్స్ కు ఇది శుభవార్త అనే చెప్పాలి. తెలుగు సినిమాకు ఎప్పుడూ గుండెకాయ లాంటి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతం ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంటోంది. దశాబ్దాలుగా ఎన్నో బాక్సాఫీస్ రికార్డులకు వేదికైన ఈ ప్రాంతంలో.. మొన్నటి వరకు కేవలం పాత తరహా సింగిల్ స్క్రీన్ థియేటర్లు మాత్రమే ఉండేవి. కానీ.. ఇప్పుడు ఆ సంస్కృతి పూర్తిగా మారిపోతోంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఒకేసారి రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి.హైదరాబాద్‌లో సినిమా అంటే గుర్తొచ్చే సంధ్య, దేవి, సుదర్శన్ వంటి ఐకానిక్ థియేటర్లకు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సుమారు 18 థియేటర్లు ఉండేవి. వీకెండ్‌లో కొత్త సినిమాల సందడితో ఈ ప్రాంతమంతా కిటకిటలాడేది. ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాలకు మల్టీప్లెక్స్ మెరుగులు దిద్దుతున్నారు.

1. ఓడియన్ మల్టీప్లెక్స్ ప్రారంభం

ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన ఓడియన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ స్థానంలో.. ఇప్పుడు అత్యంత విలాసవంతమైన ఓడియన్ మల్టీప్లెక్స్ రూపుదిద్దుకుంది. ఇది అక్టోబర్ 24, 2025 న సినీ ప్రియుల కోసం తన తలుపులు తెరుస్తుంది. ఇందులో 8 స్క్రీన్‌లు ఉంటాయి. సినిమా చూసే అనుభవాన్ని పెంచడానికి అత్యాధునిక ప్రొజెక్షన్, సౌకర్యవంతమైన లగ్జరీ సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్కింగ్



ఇబ్బందులు లేకుండా మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించారు. సినిమా హాల్‌తో పాటు, అందులోనే షాపింగ్ మాల్ కూడా ఉంది. దీంతో ప్రజలు ఒకేచోట సినిమాలు చూస్తూ, షాపింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది.

2. సంక్రాంతికి ఏఎంబీ క్లాసిక్ ఓడియన్ ప్రారంభమైన వెంటనే.. సంక్రాంతి 2026 సందర్భంగా మరో భారీ మల్టీప్లెక్స్ రాబోతోంది. అదే.. ఏఎంబీ క్లాసిక్. ఇది పాత సుదర్శన్ 70ఓఓ థియేటర్ ఉన్న చోట నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ మహేష్ బాబుకు హైదరాబాద్‌లో ఇది రెండవ మల్టీప్లెక్స్ వెంచర్ కావడం విశేషం. ఏఎంబీ క్లాసిక్‌లో మొత్తం 7 స్క్రీన్‌లు ఉంటాయి. ఈ మల్టీప్లెక్స్‌లో విడుదల కానున్న మొట్టమొదటి పెద్ద సినిమా 'ది రాజా సాబ్' అయ్యే అవకాశం ఉంది. పీవీఆర్, ఐనాక్స్ వంటి పెద్ద కంపెనీల పోటీని ఏఎంబీ క్లాసిక్ ఎలా ఎదుర్కొంటుందో అని సినీ అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.ఈ రెండు మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వస్తే.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని స్క్రీన్‌ల సంఖ్య 18 నుంచి 25కు పెరుగుతుంది. అయితే.. ఈ ప్రాంతంలోని కొంతమంది విద్యార్థులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు వీటి వల్ల ట్రాఫిక్ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని.. ఇక్కడ భూమి ధరల పెరుగుదల వల్ల అద్దెలు ఎక్కువవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఈ మార్పు సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది.

## గ్రామాల్లో ఎన్నికల సందడి

హైదరాబాద్,అక్టోబర్ 3 (భారత శక్తి)
ప్రాదేశిక ఎన్నికలు మహబూబా బాద్ జిల్లాలో రెండు దశల్లో నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రా మాల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 జెడ్పిటిసి స్థానాలు, 193 ఎంపీటీసీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహి స్తున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్న అధికారులు, పోలీసు బందోబస్తు, ఇతర అవస రాల ప్రాతిపదికన నేపథ్యంలో రెండు విడుదల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలు 9 జడ్పిటిసి స్థానాలు, వాటి పరిధిలో ఉన్న 104 ఎంపీటీసీ స్థానాలకు, రెండవ విడత 9 జడ్పిటిసి స్థానాలు, వాటి పరిధిలో ఉన్న 89 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు.రెండు విడతల్లో జరిగే ఎన్నికలకు బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు పూర్తి చేశారు. 18 జెడ్పిటిసి స్థానాలు, 193 ఎంపీటీసీ స్థానాలకు 1,066 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే ఖరారు చేశారు. మొత్తం 5,56,780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించాల్సి ఉండగా, 24 మంది రిటర్నింగ్ అధికారులను, 22 మంది అసిస్టెంట్ రిటర్ని అధికారులను నియమించారు.అలాగే 1,279 మంది పోలింగ్ అధికారులను, 5,858 పోలింగ్ సిబ్బందిని నియమించారు. నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 142 మంది ఆర్వో, ఏఆర్వోలను నియమించారు. 12 మంది జిల్లాస్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి వివిధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు.

మొదటి ఎన్నికలు జరిగే మండలాలు

బయ్యారం, చిన్న గూడూరు, దంతాలపల్లి, గార్ల, గూడూరు, మహబూబాబాద్, నరసింహులపేట, పెద్ద వంగర, తొర్రూరు ఉన్నాయి. అక్టోబర్ 10 నుండి నామినేషన్ల స్వీకరణ, 23వ తేదీన ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

రెండో దశ ఎన్నికలు జరిగే మండలాలు

డోర్నకల్, గంగారం, ఇనుగుర్తి, కేసముద్రం, కొత్తగూడ, కురవి,



మరిపెడ, నెల్లికుదురు, సిరోలు మండలాలు. అక్టోబర్ 13 నుండి నామినేషన్ల స్వీకరణ, 27వ తేదీ ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

ఎన్నికలు నిర్వహిస్తారా? స్థానిక పోరుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన చిక్కులు తొలగిపోతాయా, ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అన్న అంశం ఈనెల 8న స్పష్టమయ్యే అవకాశాలు ఉన్నాయని, ఆ తరువాతే పోటీ వ్యవహారం చూద్దామని ఆలోచనలో వివిధ పార్టీల నాయకులు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.అయితే మరోవైపు ఇప్పటికే ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయడానికి చాలామంది నేతలు సన్నాహాలు ప్రారంభించారు. అయితే చాలా చోట్ల తమకు అనుకూలంగా పోటీ చేయడానికి రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

బీసీలకు పెద్దపీటమహబూబాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన 42 శాతం బీసీల రిజర్వేషన్ల వల్ల ఈసారి జడ్పిటిసి, ఎంపీపీ స్థానాల్లో బీసీలకు పెద్దపీట లభించింది. 2019లో 16 ఎంపీపీ, 16 జెడ్పిటిసి స్థానాలు ఉండగా బీసీలకు ఎంపీపీ స్థానాల్లో ఒక్కటి కూడా కేటాయించలేదు.ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ఆరు స్థానాలు కేటాయించారు. అలాగే 2019లో జరిగిన జెడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు ఒక్క స్థానం కూడా కేటాయించకపోగా ఇప్పుడు ఏడు స్థానాలను కేటాయించడంతో బిసి వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

## బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలి

మద్రాస్ అక్టోబర్ 3 (భారత శక్తి)
; కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు మద్రాస్ హైకోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది.

## కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన అడిషనల్ డీసీపీ అడ్మిన్ సిహెచ్ కుషాల్కర్

సిద్దిపేట అక్టోబర్ 3 (భారత శక్తి)
సిద్దిపేట అడిషనర్ డీపీసీ (అడ్మిన్) సిహెచ్ కుషాల్కర్ శనివారం నాడు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన బాపూజీ అని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ తొలి ఉద్యమకారుడు, దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని, అవే విలువలను జీవితాంతం పాటిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిగా నిలిచారని, అణగారిన వర్గాల హకుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప మహనీయుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ మల్లేశం గౌడ్, ఎస్బి ఇన్స్పెక్టర్ మొగిలి, సూపరిండెంట్లు ఫయాజుద్దీన్, వెంకటేశ్వరరావు, ఎస్బి ఎస్ఐలు మహేష్, బాలకృష్ణ, ఎస్బి ఎఎస్ఐ పద్మారావు, మరియు కార్యాలయ అధికారులు సిబ్బంది పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు.

## కూటమి పగ రైతన్న దగా

**కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి.విజయ జ్యోతి**

బద్వేలు అక్టోబర్ 3 (భారత శక్తి)
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి రైతన్న కష్టాలు కనబడడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి గారి నేతృత్వంలో ఈరోజు విజయవాడ పార్టీ ఆఫీస్ దగ్గర నుండి ర్యాలీగా బయలుదేరి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి పాల్గొని ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రతి రైతు కలలో ఆనందం చూడాలని పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కన్నీళ్లతో ఉల్లి రైతులు ఉన్నారని రైతుకే మిరప గాటు అని వారు నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గం శివ మోహన్ రెడ్డి , జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలీ ఖాన్, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్చార్జి ఇర్ఫాన్ భాష, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న రామిరెడ్డి , యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీ మైనుద్దీన్ , కార్మిక విభాగం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ ఫైరోజ్ హుస్సేన్ ,బద్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పుల్లారు భాష, డివిజన్ ఇంచార్జ్ లు ముబారక్ బాషా, సిద్ధిక్, షామీర్ , జిలాన్, అబ్దుల్ రఫ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## దుకాణం సముదాయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే.

వనపర్తి. అక్టోబర్ 3 (భారత శక్తి)
వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

వనపర్తి పట్టణంలో పలు దుకాణ సముదాయాలను ప్రారంభించారు.పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిపై పెద్దమందడి మండలం మనిగిళ్ళ గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు వాటర్ ప్రూఫ్ సొల్యూషన్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు.యువకుడు ఏర్పాటు చేసుకున్న ఈ దుకాణాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.అనంతరం కొత్తకోట రోడ్డు ఖీూ ఆఫీస్ పక్కన ఆత్మకూరు మండలానికి చెందిన మహేష్ ఏర్పాటు చేసుకున్న చాయి దుకాణం ఎమ్మెల్యే ప్రారంభించారు.వనపర్తి పట్టణం న్యూ టౌన్ కాలనీకి చెందిన జ్యోతి కొత్త బస్టాండు వెనకాల ఏర్పాటు చేసుకున్న జ్యోతి బ్యూటీ పార్లర్ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఉన్నత చదువులు చదివిన నేటి యువత ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటూనే ఇలాంటి స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తద్వారా భవిష్యత్తు బాగుంటుందని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

====================

## శాంతి తోనే అభివృద్ధి సాధ్యం

**ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని**



హైదరాబాద్ అక్టోబర్ 3 (భారత శక్తి) మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకుని రోడ్ నెంబర్ వన్ కెపిహెచ్బి కాలనీ హైదరాబాద్ నందుగల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సందర్భంగా డాక్టర్ పద్మిని గారు మాట్లాడుతూ గాంధీ బోధించిన అహింస శాంతి మార్గంతో ఆ రోజుల్లో ఏ విధంగా స్వాతంత్రాన్ని సంపాదించుకున్నాము అలాగే శాంతితో ముఖ్యంగా యువత తమ భవిష్యత్తుని సన్మార్గ మార్గంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాలలో గాంధీ బోధించిన శాంతి మార్గాన్ని విద్యార్థుల్లో ప్రభావితం చేసే విధంగా పాఠ్యాంశాలుగా మరింతగా ప్రవేశపెట్టాలని కోరారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ సామాజికవేత్తలు వేల్పూర్ శ్రీనివాస్ విజయదేవి తదితరులు పాల్గొన్నారు

## చిత్తూరు జిల్లా అంబేద్కర్ విగ్రహ ఘటనపై సీఎం ఆరా

చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. జరిగిన నష్టంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విగ్రహానికి ఆనుకుని ఉన్న షెడ్డుకు ఆగంతకులు రాత్రి నిప్పు పెట్టడటంతో అంబేద్కర్ విగ్రహానికి నష్టం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. జాతీయ నేతల విగ్రహాలకు అవమానం జరిగేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

================================

## దసరా పండుగకు రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు



హైదరాబాద్, అక్టోబర్ 3 (భారత శక్తి) దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి.అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

# సిండికేట్ గా వైన్స్ మాఫియా

నిజామాబాద్,అక్టోబర్ 3 (భారత శక్తి)
కొత్త వైన్ షాపుల ఏర్పాటుకు సర్కారు పచ్చ జెండా ఊపడంతో మద్యం వ్యాపారులు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు మళ్లీ రెడీ అవుతున్నారు. మద్యం షాపులను దక్కించుకునేందుకు దరఖాస్తుల సమయంలోనే సిండికేట్ గా వైన్స్ మాఫియా ఏకమవుతున్నారు. మద్యం మాఫియా డాన్లు రంగ ప్రవేశం చేసి చక్రం తిప్పుతున్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం సిండికేట్ వ్యాపారులు తమ ఆర్థిక పరిపుష్టి, పలుకుబడిన ఉపయోగించి లిక్కర్ దందాను పెంపొందించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు మద్యం మాఫియా వైన్ వ్యాపారులతో కలిసి రహస్యంగా భేరసారాలు కుదుర్చుకునే పనిలో నిమగ్నమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా కామారెడ్డి, నిజామా బాద్, బోధన్ ఆర్మూర్,ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ ప్రాంతాల్లో నడుస్తున్న వైన్ వ్యాపారాలను బేరీజు వేసుకుంటున్నారు.గడిచిన దినాల్లో ఏ ప్రాంతాల్లో అధికంగా క్రయవిక్రయాలు జరిగాయన్న విషయాన్ని పరిగణంలోకి తీసుకొని ఆయా ప్రాంతాల లో ఉన్న వైన్ షాపులపై మాఫియా దృష్టి పెడుతున్నారు. లిక్కర్ అధికంగా అమ్ముడుపోయే షాపులను చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా షాపులు రిజర్వేషన్ ప్రకారంగా ఉంటే బినామీ పేర్లపై కూడా టెండర్ వేసి సాహసం చేసేందుకు సిద్ధ మవుతున్నారు.ఉమ్మడి జిల్లాలో గతంలో2023-2025 సంవత్సరానికి గాను మద్యం వ్యాపారులకు అధిక లాభార్జన జరిగింది. తిరిగి ప్రభుత్వం టెండర్ల కాలం ముగియడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వైన్ షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.26 సెప్టెంబర్ 2025 నుండి అక్టోబర్ 18వ తేదీ 2025 వరకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను చేపడుతున్నారు. తదుపరి



అక్టోబర్ 23వ తేదీన డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయింపు జరిపేందుకు ఎక్సైస్ శాఖ చర్యలు చేపట్టనున్నారు.కొత్త దుకాణాలకు 2025 డిసెంబర్ 1 నుండి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితిగా నిర్ధారించారు. అయితే గడిచిన టెండర్లలో టెండర్లు వేసే ప్రతి వ్యక్తి రెండు లక్షల రూపాయలు మాత్రమే చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ దఫా ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయలు పెంచుతూ టెండర్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

**కొత్తగా మద్యం దుకాణాల టెండర్ కు మూడు లక్షలు**

కొత్త మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ఉత్సాహాన్ని చూపే వ్యాపారులు ఒక్కో వైన్ షాప్ కోసం టెండర్ ఫీజు రూ.3 లక్షలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అట్టి డబ్బు తిరిగి చెల్లించే అవకాశం ఉండదు. టెండర్ల ప్రక్రియ అనంతరం 2025 డిసెంబర్ 1 న గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు ఐదు శాతం కింద మద్యం దుకాణాలు కేటాయించే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఈ దఫా జరిగే టెండర్లలో పోటీ దార్ల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లిక్కర్ దందాల కొనసాగుతున్న వారే కాకుండా, ఇతరులు కూడా వైన్ షాప్ ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. తమ తమ ఏరియాలలో వైన్ షాపులను దక్కించుకునేందుకు ఇతర వ్యాపారాలకు చెందిన వ్యక్తులు కూడా టెండర్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.లిక్కర్ దందాలో లాభాలు ఎక్కువగా రావడంతో వైన్ వ్యాపారంలో కొనసాగేందుకు ఉత్సాహపడుతున్నారు. ఈ మేరకు వైన్ దందాలో ఉన్నవారితో పోటీపడేందుకు సైతం సిద్ధపడుతున్నారు. 2023-25 సంవత్సరానికి గాను క్రితం జరిగిన టెండర్లలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 3579 మంది వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2025- 27 కు సంబంధించి జరిగే టెండర్లలో పోటీదారుల సంఖ్య ఇంత పెరిగే అవకాశాలు స్పష్టమవుతున్నాయి.దఫా 5000 వరకు టెండర్లు నమోదు కానున్నట్టు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో 102 వైన్ షాపులు నడుస్తున్నాయి. వీరి ద్వారా మరో వెయ్యికి పైగా షాపులు అనధికారికంగా( బ్లాక్ షాపులు) కొనసాగుతున్నాయి. ఈసారి లిక్కర్ వ్యాపారులతో కలిసి దందా చేసిన బ్లాక్ షాప్ మద్యం వ్యాపారులు కూడా టెండర్లలో పాల్గొనేందుకు సిద్ధహస్తులవుతున్నారు.

**రిజర్వేషన్ షాపులపై దృష్టి..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో లిక్కర్ మాఫియా రిజర్వేషన్ షాపులపై కూడా దృష్టి సారించింది. గౌడ్స్, ఎస్ టి, ఎస్ సి వర్గాలకు వచ్చే షాపులను కైవసం చేసుకునేందుకు ఆయా వర్గాలకు చెందిన నిరుపేద వ్యక్తులతో టెండర్లు వేయించే ప్రయత్నం చేస్తున్నారు. వారి పేరిట షాపులను దక్కించుకొని దందాను నడుపుకునే ప్లాన్ వేస్తు న్నారు.వారికి నయానో భయానో అప్పచెప్పి వారి పేరిట వైన్ షాపును పొంది లిక్కర్ దందాల కొనసాగేందుకు అనుకూలమైన వ్యక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండు రోజులుగా మద్యం సిండికేట్ మాఫియా రహస్య సమావేశాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ఎక్కువగా లిక్కర్ అమ్ముడుపోయే అడ్డాలపైనే దృష్టి పెడుతున్నారు. ఆ షాపులపై ఐదు నుండి 10 వరకు వేసేందుకు సైతం రంగం సిద్ధం చేస్తున్నారు.

**నిరుద్యోగులు సైతనీ..**

మద్యం సిండికేట్ మాఫియా నిరుద్యోగ యువకుల పేర్లతో టెండర్లలో భాగస్వాములను చేసే వాతావరణం కనిపిస్తోంది. వారి పేరిట కూడా షాపులను చేజిక్కించుకొని దందాను పెంపొందించుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ మేరకు వారిపై కూడా ఒకటికి మించి ఐదు వరకు టెండర్ ఫారాలను వేసేందుకు తగిన పైకాన్ని సిద్ధం చేసుకుంటున్నారు.ఉమ్మడి నిజామాబాద్,కామారెడ్డి జిల్లాలో ఈసారి జరిగే మద్యం టెండర్లలో మద్యం సిండికేట్ మాఫియా డాన్లు తమ ఉనికిని చాటుకొని పెద్ద మొత్తంలో షాపులను దక్కించుకోవడమే కాకుండా అధిక లాభాలను గడించేం దుకు ఉన్న అవకాశాలు అన్నింటిని వాడుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికా రులు సైతం లిక్కర్ మాఫియా కు ఎక్కడెక్కడ ఏ షాపులు దక్కించుకుంటే లాభాలు అర్జించవచ్చు అని విషయాలను అందజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.టెండర్ల ప్రక్రియలో ఎలాంటి మెలుకువలు పాటించా లో కూడా ఎక్సైజ్ అధికారులు తగు సూచనలు ఇస్తున్నట్లు సమాచారం. మరి ఈసారి లిక్కర్ టెండర్లు మాఫియా చేతుల్లోకి వెళ్ళిపోతాయా... కొత్తవారికి దక్కుతాయా.. లే దో. వేచి చూడాల్సిందే..

# 20 ఏళ్లుగా ఆ గ్రామ ఉప సర్పంచే

ఖమ్మం అక్టోబర్ 3 (భారత శక్తి)
తెలంగాణ రాష్ట్రంలోని పలు షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్ల సమస్య కారణంగా గ్రామ సర్పంచ్ పదవులు ఖాళీగా ఉంటున్నాయి. ఖమ్మం జిల్లాలోని నూకలంపాడులో ఎస్టీలకు సర్పంచ్ స్థానం కేటాయించినా.. గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీనివల్ల గత నాలుగు టర్మ్‌లుగా ఉపసర్పంచ్‌కే సర్పంచ్ అధికారాలు అప్పగిస్తున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో నాలుగు గ్రామాల్లో ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేయగా, అభ్యర్థులు కరువయ్యారు. దీంతో ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయి, ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది.తెలంగాణ రాష్ట్రంలోని పలు షెడ్యూల్డ్ ఏరియాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు విచిత్రమైన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. రిజర్వేషన్లు కేటాయింపులో ఉన్న లోపాల కారణంగా కొన్ని గ్రామాలలో సర్పంచ్ పదవి ఖాళీగా ఉండిపోతోంది, ఫలితంగా ఆయా ప్రాంతాల అభివృద్ధి కుంటుపడుతోంది.ఖమ్మం జిల్లాలో విచిత్ర పరిస్థిత.. ఖమ్మం జిల్లా, ఏన్కూరు మండలం పరిధిలోని నూకలంపాడు గ్రామ పంచాయతీలో ఈ విచిత్రమైన పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోంది. మొత్తం 1,063 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామ పంచాయతీని షెడ్యూల్డ్ ఏరియాగా ప్రకటించారు. దీని ప్రకారం సర్పంచ్ స్థానంతో పాటు, మొత్తం ఎనిమిది వార్డుల్లో నాలుగు ఎస్టీలకు రిజర్వ్ చేశారు.దురదృష్టవశాత్తు నూకలంపాడు పల్లెలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీని కారణంగా 2004 నుంచి ఇప్పటివరకు సర్పంచ్ పదవితో పాటు ఎస్టీలకు కేటాయించిన నాలుగు వార్డులు ఖాళీగా ఉంటున్నాయి. గత నాలుగు టర్మ్‌ల ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఈ క్రమంలో.. ఎన్నికలు జరిగిన జనరల్ వార్డుల్లో గెలిచిన సభ్యులలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకొని, ఆ ఉపసర్పంచ్‌కే సర్పంచ్ అధికారాలు అప్పగిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగనుంది.నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో కూడా పరిస్థితి ఇందుకు తగిన విధంగానే ఉంది. ఈ మండలంలోని కల్ములోనిపల్లి, ప్రశాంత్‌నగర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి అనే నాలుగు గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలను ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేశారు. ఈ నాలుగు గ్రామాలలోనూ ఎస్టీ కుటుంబాలు లేకపోవడంతో, సర్పంచ్ అభ్యర్థులే కరువయ్యారు. గత ఎన్నికల్లోనూ ఇలాగే జరిగింది, ఫలితంగా ఐదేళ్లపాటు ఈ పల్లెలలో ప్రత్యేకాధికారి పాలనే కొనసాగింది. ఈసారైనా రిజర్వేషన్లు మారుతాయని ఆశించిన గ్రామస్తులకు మళ్లీ నిరాశే ఎదురైంది.

**గ్రామాల అభివృద్ధికి ఆటంకం..**

సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడం వల్ల ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధి లేకపోవడంతో ప్రభుత్వ నిధులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలంలో కూడా ఎన్.వి. బంజర (బీసీ మహిళ), రాములుతండా (బీసీ జనరల్) గ్రామాల్లో బీసీ ఓటర్లు లేకపోవడంతో, అక్కడ కూడా వార్డు సభ్యుల్లో ఒకరిని ఉపసర్పంచ్‌గా నియమించి, సర్పంచ్ బాధ్యతలను అప్పగించనున్నారు. స్థానిక అధికార యంత్రాంగం స్పందించి.. ఆయా ప్రాంతాల్లోని సామాజిక వర్గాల జనాభా ప్రకారం రిజర్వేషన్లను మార్పు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కేంద్రీయ వి35ద్యాలయం వనపర్తి జిల్లాకు మంజూరు.

**ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు. తెలిపిన వనపర్తి జిల్లా బిజెపి నాయకుడు ఉండే కోటి అంజి.**

వనపర్తి. అక్టోబర్ 3 (భారత శక్తి)
వనపర్తి జిల్లా కేంద్రానికి పేదింటి విద్యార్థిని విద్యార్థులు ఫీజులు కట్టలేక ఆర్థిక భారాలు మోయలేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులకు సెంట్రల్ సిలబస్ ఉన్నత చదువులు చదివి గొప్ప గొప్ప ఉద్యోగాలు పొందడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం వనపర్తి పట్టణానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి కృషి చేసిన పోతుగంటి రాములు మాజీ ఎంపీ , ఎంపీ డీకే అరుణమ్మ , బిజెపి ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు డి నారాయణ , కేంద్రీయ విశ్వవిద్యాలయం దాదాపు 120 కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న కేంద్రీయ విశ్వవిద్యాలయం వనపర్తి జిల్లా కేంద్రానికి రావడానికి కృషి చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఉందే కోటి అంజి తెలియజేయడం జరిగింది.

## ఒడిశా గోపాల్పూర్ దగ్గర తీరం దాటిన తీవ్ర వాయుగుండం




విశాఖపట్నం అక్టోబర్ 3 (భారత శక్తి)బంగాళాఖాతంలోని ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం ఉదమయం ఒడిశా గోపాల్పూర్ దగ్గర తీరం దాటింది. కోస్తా జిల్లాలపై వాయుగుండం ప్రభావం పడనుంది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్అలర్ట్ జారీ చేసారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరంలో ఫ్లాష్ ఫ్లడ్స్ లకు ఆవకాశముంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం వుంది. కాకినాడ, కోనసీమ, తూ.గో, ఏలూరులో భారీ వర్షాల సూచనుంది. ప్రధాన పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేసారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం, గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం వుంది.

## భారీ వర్షాలతో ఉప్పొంగిన నాగావళి, వంశధార నదులు

అమరావతి, అక్టోబర్ 3 (భారత శక్తి)
భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగిన నేపథ్యంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు (శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వరద పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని... ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు.వంశధార, నాగావళి నది లోతట్టు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని ఆదేశించారు. విపత్తుల సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. విపత్తుల సంస్థ



హెచ్చరిక సందేశం వచ్చినప్పుడు ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచనలు చేశారు.మరోవైపు వంశధార నది పరివాహక ప్రాంతంలో దిగువున ఉన్న గ్రామ ప్రజలకు మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడమైనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. వంశధార నదికి గొట్ట బ్యారేజ్ వద్ద దిగువకు 1, 04, 891 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

# అరేబియా సముద్రం లో తొలి తుఫాను.. 'సైక్లోన్ శక్తి' గా నామకరణం

న్యూ ఢిల్లీ అక్టోబర్ 3 (భారత శక్తి)
;ఈ ఏడాది అరేబియా సముద్రం లో తొలి తుఫాను ఏర్పడింది. భారత వాతావరణ విభాగం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఈశాన్యం వైపు ద్వారకకు 240 కిలోమీటర్ల దూరంలో, పోరుబందర్‌కు 270 కిలోమీటర్ల దూరంలో అల్పపీడనం ఏర్పడింది.అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తుఫానుగా మారింది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ తుఫాను కు 'సైక్లోన్ శక్తి' గా నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం.. హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు ఈ తీరంలో ఏర్పడే తుఫానులకు పేర్లను నిర్ణయిస్తాయి.భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ దేశాలు తుఫాన్‌లకు పేర్లు పెడుతాయి. కొన్ని తుఫానుల ప్రభావం చాలారోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుఫాను వస్తే ఎక్కడ ఏ తుఫాను ప్రభావం అనే విషయంలో తికమక లేకుండా ఉండటం కోసం తుఫానులకు పేర్లుపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు.తాజా తుఫానుకు 'శక్తి' అనే పేరును శ్రీలంక పెట్టింది. తుఫానులకు పేర్లు పెట్టడం ద్వారా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుఫాను చెప్పడం, అర్థం చేసుకోవడం సులువు అవుగుంది. అయితే తుఫానులకు పెట్టే పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉన్నది.కాగా ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుఫాను హెచ్చరిక కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు తుఫానులకు సంబంధించి సూచనలు, సమాచారం ఇస్తుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణ కేంద్రం కూడా ఒకటిగా పనిచేస్తోంది.

అక్షర క్రమాన్ని అనుసరించి ఒక్కో దేశం ఒక్కో తుఫానుకు పేరును సూచిస్తాయి. ప్రతిసారి ఆ పేరు కొత్తగా, మళ్లీ పునరావృతం కాకుండా ఉండాల్సి ఉంటుంది. తుఫానులకు పేర్లు పెట్టే విషయంలో పలు నిబంధనలు ఉన్నాయి. 'తుఫాను పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు' అనేవి ప్రధాన నిబంధనలుగా ఉన్నాయి.

# అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి : శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 03: స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా నేడు కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన జిల్లా లోని నాలుగు అసెంబ్లీ ల వారిగా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సంసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేస్తున్న కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు అయ్యే అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంటుందని, అవకాశం ఉన్న ప్రతి బీజేపీ కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనీ సూచించారు. ఒక వేళ రిజర్వేషన్ కారణంగా పోటీ చేసే అవకాశం లేని వారు గెలిపించే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ కార్యకర్తలు ఇప్పటి నుండే ప్రజల్లో ఉంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను, బీజేపీ సిద్ధాంతాలను, నరేంద్ర మోదీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అన్నారు.

# రసాయన శాస్త్రంలో చీమలపాటి వీఏ శశికళ కు పీహెచ్ డీ



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి అక్టోబర్ 3 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని చీమలపాటి వీఏ శశికళ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'స్గల్ట్ 2 నిరోధకం అయిన కెనాగ్లిఫ్లోజిన్, యాంటీ-ఆండ్రోజెన్ అయిన అబిరాటెరోన్ అసిటేట్, వాటి సంబంధిత పదార్థాల సమర్థవంతమైన సంశ్లేషణ'పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నాప్రగడ రత్నమాల శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ శశికళ అధ్యయనంలో గ్లిఫ్లోజిన్ కెమిస్ట్రీ, అబిరాటెరోన్ అసిటేట్ ముఖ్యంశాలుగా తెలియజేశారు. మొదటి పద్ధతిలో 17 గ్లిఫ్లోజిన్ ఉత్పన్నాల కోసం సింథటిక్ వ్యూహాల సమగ్ర సమీక్ష, ఇందులో కెనాగ్లిఫ్లోజిన్ సంశ్లేషణ కోసం ఒక వినూత్నమైన, సమర్థవంతమైన పద్ధతి అభివృద్ధి, ఔషధ ఆవిష్కరణలో ఆచరణాత్మక పద్ధతులను మెరుగుపరుస్తుందని వివరించారు.ఇక అబిరాటెరోన్ అసిటేట్ అధ్యనంలో, అధునాతన 2డీ, 3డీ స్పెక్ట్రల్ పద్ధతులను ఉపయోగించి ఎనిమిది యూఎస్పీ జాబితాతో ఏపీఐ సంబంధిత మలినాలకు చెల్లుబాటయ్యే ఫ్రేమ్ వర్క్ తో పాటు, భారీ సంశ్లేషణకు పర్యావరణ అనుకూల, ఖర్చు-సమర్థవంతమైన, నాణ్యత ఆధారిత (%ుఎఱ%) విధానం రూపొందించినట్టు తెలిపారు.ఈ పరిశోధనలు ఔషధ సంశ్లేషణలో స్థిరమైన, ఖచ్చితమైన, వినూత్న విధానాల యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తోందన్నారు.ఈ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు డాక్టర్ వీఏ శశికళను అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కుబీర్ మండలంలోని రంజిని తాండలో ఘనంగా తీజ్ పండుగ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 3 (భారత శక్తి)
నిర్మల్ కుబీర్ మండలానికి చెందిన రంజిని తాండలో ఆదివాసీ మహిళలు తీజ్ పండుగను సంప్రదాయపరంగా ఘనంగా జరిపారు. తీజ్ పండుగను పురుషుల రాహిత్యంలో మహిళలు సంతోషంగా, ఉత్సాహంగా నిర్వహించారు. వివాహితులు భర్తల దీర్ఘాయుష్షు కోసం ఉపవాసం ఉండి, వానకాల పర్వదినాన్ని ప్రత్యేకంగా జరుపుకున్నారు.

సాంప్రదాయ నృత్యాలు, పాటలతో పండుగ ఉత్సాహంగా సాగింది. మహిళలు పచ్చని వస్త్రధారణలో అలరిస్తూ, పల్లె సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉత్సవాన్ని నిర్వహించారు. స్థానిక పెద్దలు, యువత పాల్గొని పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# విజయదశమి విజయాలకు దారి దీపం కావాలి



రాజేంద్రనగర్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 03: శవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత పూజ ముగింపు సందర్భంగా శమీ పూజను స్థానిక అత్తాపూర్ హైదర్గూడలో ఫ్రెండ్స్ కాలనీలో మైసమ్మ టెంపుల్ కమిటీఘనంగానిర్వహించింది.

శమీ పూజ మైసమ్మ టెంపుల్ కమిటీ అధ్యక్షులు సన్నివెల్లి శ్రీపాల్ రెడ్డి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

శమీ పూజ పాపాలను హరిస్తుందని శమీ పూజ ద్వారా సర్వశక్తులు సమకూరివిజయదశమి నాడు విజయాలు చేకూరుతాయనిభక్తుల విశ్వాసం.శమీ వృక్షాన్ని పూజించడం ప్రాచీన కాలం నుండి వస్తున్న సంప్రదాయమని రాముడు రావణుని పై విజయం సాధించిన దినంగా పాండవులు వనవాసం కోసం వెళ్తూ శమీ వృక్షం పై నుండి తమ ఆయుధాలు తిరిగి పొంది కౌరవులను జయించిన దినంగా విజయదశమిని జరుపుకుంటారు. భవిష్యత్తులో సామాజిక సమస్యలు కష్టాలు ప్రకృతి విపత్తులు నివారించబడి పాడి పంటల సమృద్ధితో స్వయం సమృద్ధి తో సామాన్యుని కష్టాలు తొలగి సంక్షేమం పెరగాలనిప్రజలకు సుఖశాంతులు ఇవ్వాలని సమాజంలో ప్రేమ అభిమానాలు ఆప్యాయతలు వర్ధిల్లాలని సుఖశాంతులు శాంతియుత సమాజ నిర్మాణం జరగాలని శమీ పూజలో పాల్గొన్న భక్తులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సన్నివెళ్ళి శ్రీపాల్ రెడ్డి శివరాజ్ రెడ్డి శశి మోహన్ రెడ్డి గంగాధర్ కృష్ణస్వామి మోహన్ రెడ్డి బలవంత రెడ్డి సత్యనారాయణ ప్రవీణ్ సన్నివేలి శ్రీరామ్ రెడ్డి కళ్యాణ్ రెడ్డి అశోక్ రెడ్డి మరియు మహిళలు పాల్గొన్నారు.

# దసరా పండుగకు రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు



హైదరాబాద్, అక్టోబర్ 3

దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి.అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

# విజయ రహస్యం..!



మిత్రమా!
నీకు
ఆనందం దూరమవుతుంది
అసూయ ఎక్కువైతే
ఆత్మీయులు దూరమవుతారు
అహంకారం అతిశయిస్తే
అందరూ విరోధులవుతారు
మాట మితిమీరితే

అందుకే
నీవు ఎదిగే కొద్దీ ఒదిగే ఉండు
ఎక్కడ నెగ్గాలో, తగ్గాలో తెలిసి మెలుగు
మంచి సమయం చెప్పి రాదు
చెడు సమయం చెప్పి పోదు
అతిగా ఆలోచించడం మానుకో!
కాలంతో పాటు నడవడం నేర్చుకో!

ఇక్కడ
నీవు నిలువవు శాశ్వతంగా
నీలోని మంచితనమే
నిన్ను నిలుపుతుంది శాశ్వతంగా
నీవు గెలవాల్సింది బయటున్న
శత్రువులతో కాదు
నీలో దాగిన ఆరుగురితో
యుద్ధం చేసి గెలువు ముందు
రేపటి విజయాల వెలుగు కిరణాలను చూడాలనుకుంటే
నేటి కష్టాల కటిక చీకటితో
నీవు యుద్ధం చేయాల్సిందే!
ఆ నిరంతర యుద్ధంలో
నీవు విజయుడిగా నిలబడాలంటే
నీలో కర్తవ్యనిష్ఠను పెంచుకో!
నీలోని ఆత్మశక్తిని దర్శించుకో!
నీ విజయాల లక్ష్యాన్ని చేరుకో!
ని విజయ రహస్యమిదే అని తెలుసుకో!

"సాహిత్య కళా విభూషణ"
చౌదూరి నరసింహారావు
కవి, పత్రికా రచయిత, విశ్లేషకులు

# ప్రభుత్వం అడ్డా కూలీల జీవితాలలో వెలుగులు నింపాలి

## (ప్రభుత్వం అడ్డా కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలి)

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రత్యేక ప్రతినిధి):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో' జీవన పోరాటంలో రోజువారి కూలీ చేసుకుని బ్రతుకుతున్న కార్మికుల స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రభుత్వం సమగ్రమైన చర్యలు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 33 జిల్లా కేంద్రాలలో ఉన్న అడ్డా కూలీల సంఖ్య. కూలీల వివరాలు. కూలీల విద్యార్హతలు గృహ వసతి మునగ అంశాలపై సర్వే నిర్వహించి లేబర్లుగా గుర్తిస్తూ వారికి లేబర్ కార్డులు ఇవ్వాలి. అడ్డా కూలీలు తమ నివాస ప్రాంతాల నుండి పనిచేసే ప్రాంతాలకు వాళ్ళు ఉపయోగిస్తున్న రవాణా విధానాలు' రవాణా' వసతి మొన్నగు మౌలిక సౌకర్యాల లభ్యత అంశాల మీద సర్వే నిర్వహించాలి. అడ్డా కూలీలలో ఎక్కువశాతం భవన నిర్మాణ కార్మికులే ఉండడం గమనార్హం. తాపీ మేస్త్రీలు 'అను స్కిల్డ్ ' సెమీ స్కిల్డ్ లేబర్స్ అధిక సంఖ్యలో రోజు వారీ వేతనాలు మీధ తమ శ్రమను అల్ప వేతనాలకుఅందిస్తున్నారు. వీరిలోఎక్కువశాతం ఎస్సీ' ఎస్టీ' బీ 'సీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. చాలా మంది నిరక్షరాశ్యులు. కార్మిక చట్టాల మీధ వీరికి అవగాహన వుండదు. ఒకే కాంట్రాక్టర్ కింద పనిచేసే కార్మికులు కొందరైతే వ్యక్తిగతంగా పనిచేసే వారు కొందరు అంటారు. కాంట్రాక్టర్ వద్ద పనిచేసే కూలీలకు నెలల తరబడి పని లబిస్తుంది. కార్మికులను సప్లై చేసినందుకు ప్రతి కార్మికుని నెల వేతనం నుండి 10 నుండి 20 శాతం కమిషన్ కింద తీసుకుంటారు. వ్యక్తి గతంగా పనిచేసే కార్మికులకు పని లభించడం కష్టంగా ఉంటుంది.పని లభించక పోవడం వల్ల కఠిన పేదరికాన్ని అనుభవిస్తుంటారు.

అడ్డాకులీలకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు ఇవ్వాలి

ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య కార్డు 'ప్రమాద బీమా సౌకర్యం' హెల్త్ కార్డులు' లేబర్ కార్డులు మంజూరు చేయాలి. గ్రామాల నుండి మండల కేంద్రాలకు జిల్లా కేంద్రాలకు బస్సులు రైళ్లలో ప్రయాణించడానికి టిక్కెట్ల రేట్లలో 50 శాతం ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి.

3 ఎకరాల భూమిని ఇవ్వాలి

అడ్డా కూలీలలో ఎక్కువగా భూమిలేని నిరుపేద కూలీలు . వారికి ప్రభుత్వం ప్రతి కుట్టంబానికి 3 ఎకరాల భూమికి పట్టా ఇవ్వాలి. గ్రామాలలో ఉద్యాన వనాలు పెంపకం నర్సరీ పెంపకంలో వారికి ఉపాధి కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తే పట్టణాలకు వలస తగ్గుతుంది.సన్నకారు ఉపాంత రైతులు కొద్ది భూమి కలిగిన వారు వ్యవసాయ సీజన్లో వారి సొంత వ్యవసాయ పనులు చేసుకుని రోజు వారి కూలీగా పనిచేస్తుంటారు.

అడ్డాకులీల సగటు వయసు 15-60. సం" రాలు

పనిచేసే అడ్డాకూలీల సగటు వయసు 15 సంవత్సరాల నుండి 60 సం " సంవత్సరాల వరకు ఉంటుంది. ఒక భవనం నిర్మాణం పూర్తి అయ్యేవరకు 10 నుండి 20 మంది ఒకే ప్రాంతంలో ఒక భవనం వద్ద కాంట్రాక్టర్ నిర్మించిన గుడిసె'ఇరుకు గదిలో ' టెంట్లో 5 నుండి 10 మంది నివాసముంటారు. భవన నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు ప్లంబింగ్ శానిటేషన్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తూ కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకున్న సమయం వరకు అక్కడే ఉంటారు. భవన నిర్మాణ కార్మికులలో తాపీ మేస్త్రీలు. కూలీలు. ఎలక్ట్రిషన్. పెయింటర్స్. సెంట్రింగ్ మేస్త్రీలు ఉంటారు. వీరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక మంత్రిత్వ శాఖ చట్టాలు వేతనాలు ' పనిగంటలు . సెలవుల పట్ల వీరికి అవగాహన ఉండదు.కార్మిక సంక్షేమ కార్మిక శాఖ ద్వారా అమలు అవుతున్న కార్మిక చట్టాలను వీరికి తెలియజేయాలి.

లేబర్ అడ్డలో మౌలిక వసతులుఏర్పాటు చేయాలి

ప్రతి జిల్లా' మండల 'నగర పట్టణ 'ప్రాంతాలలోని లేబర్ అడ్డాలో మంచినీటి సౌకర్యం మరుగుదొడ్లు' షెడ్లు విశ్రాంతి గదులు నిర్మించాలి.60సం"రాలు పై బడిన వారికి వృద్ధాప్య పెన్షన్ఇవ్వాలి వారికి ప్రభుత్వం ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలి. అడ్డా కూలీలపిల్లల చదువుకు స్కాలర్షిప్ సౌకర్యం కల్పించి వారికికెజీ నుండి పీజీ.వరకు ఉచిత హాస్టల్ విధ్యా వసతి కల్పించాలి. లేబర్ అడ్డ లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలు కల్పనకుప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.ఢిల్లీ హర్యానా' కర్ణాటక మహారాష్ట్ర' పంజాబ్ ప్రభుత్వాలు అడ్డా కూలీలకు మోటారు సైకిళ్లు పంపిణీ చేస్తున్న పద్ధతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలి. అడ్డా కూలీల ఆర్థిక స్థాయి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమగు అన్ని చర్యలు చేపట్టాలి.

మే డే రోజు మాత్రమే వీళ్లు సెలవు దినంగా కార్మికుల దినంగా జరుపుకుంటారు. కనీస వేతనాల చట్టాన్ని అడ్డా కూలీలకు వర్తింప చేయాలి.కార్మిక సంక్షేమ చట్టాలు పథకాలను వీరికి వర్తింప చేయాలి. ప్రతి నెల 3 రోజుకు సెలవు దినాలు వీరికి వర్తింప.చేయాలి.

కార్మిక చట్టాల పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి

ప్రభుత్వాలు కార్మికులకు నిర్ణయించిన చట్టాలు జీ 'వో 'లు వీరికి తెలియపరచాలి. వీరికి చట్టాలపై అవగాహన చైతన్యం కల్పించాలి.

ప్రతి కూలికి ఐ 'డి కార్డు ఇవ్వాలి

ప్రతికూలికి లేబర్ కార్డు కలిగి ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి. వీరికి రవాణాలో రాయితీ కల్పించాలి. హెల్త్ కార్డులు మంజూరు చేయాలి.ఇన్సూరెన్స్ కంపెనీలు అడ్డా కూలీలకు ప్రమాధ బీమా హెల్త్ ఇన్సూరెన్స్ పాలి సీలను వర్తింప చెయ్యాలి. ఇన్సూరెన్స్ ఎజెంట్స్.తమ పాలిసిలలో 5 శాతంఅడ్డ కూలీలకు ఇన్సూరెన్స్ అవకాశం కల్పించేట్లు విధి విధానాలు రూపొందించి



అమలు చేయాలి.

ఉచిత విద్య వైద్యంలి తాగునీటి సౌకర్యం' ఉచిత గృహ వసతి' పోషకాహార సౌకర్యం కలిపించాలి.

అడ్డా కూలీల జీవితాలలో వెలుగులు నింపాలిలి

భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక సంక్షేమం సామాజిక ఆర్థిక న్యాయం పంపిణీ న్యాయం సిద్ధించే బహుప్రయోజన పథకాలలో అడ్డా కూలీలను భాగస్వాములను చెయ్యాలి. ఆర్థిక భద్రత బరోసాతో అడ్డా కూలీల జీవితాలలో వెలుగు నింపాలి. శ్రమయేవ జయతే నినాదం కాకుండ శ్రామిక సంక్షేమానికి సమగ్రమైన శ్రామిక విధానాన్ని రూపొందించాలి.శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలి. శ్రమ దోపిడి విధానాన్ని అరికట్టాలి.అడ్డా కూలీల జీవితాలలో స్వేచ్ఛా ఆత్మగౌరవాన్ని పెంపొందించటానికి కార్మిక మంత్రిత్వశాఖ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను అమలు చెయ్యాలి.

అడ్డాకూలీల శ్రామిక సామర్థ్యాన్ని నైపుణ్యాన్ని పెంచటానికి ప్రభుత్వం సూక్ష్మ స్థాయి స్థూల స్థాయిలో శిక్షణా కేంద్రాలను నెలకొల్పి ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత పెంచి శీఘ్రతర ఆర్థికాభివృద్ధికి దోహదపడే ప్రత్యేక అభివృద్ధి వ్యూహాలను ప్రభుత్వం అమలు చేసి అడ్డా కూలీల జీవితాలలో వెలుగులు తెస్తుందని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్
9440245771

# విశ్వ సమైక్యత సాధనం సంగీతం

(ప్రపంచ సంగీత వారోత్సవాల సందర్భంగా)



ఉరుకుల పరుగుల హైటెక్
జీవితంలో సంగీతం మానసిక
ఒత్తిడి నిరాశ నిస్పృహలు
నెగెటివ్ భావోద్వేగాలను
తగ్గించి శారీరక మానసిక
ఉత్తేజాన్ని కల్పించే
శక్తివంతమైన సాధనం

సంగీతం మనుసులను
మలిచే శక్తివంతమైన సాధనం
ఆరోగ్యానికి మేలు చేసి
మానసిక ఒత్తిడి డిప్రెషన్
నివారించి ఆనందాన్ని కలిగించే
హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించి
మనసుకు ప్రశాంతత కలిగిస్తుంది

సంగీతం ఆనందాన్ని పంచి
మానవ సంబంధాలను కలిపే
వారధి మానసిక ఒత్తిడి
ఆందోళన తగ్గించి ధ్యానానికి
సహాయపడే సాధనం
మ్యూజిక్ తెరఫీతో
మానసిక వ్యాధులకు
చికిత్స చేస్తున్నారు

సామవేదం నుండి ప్రారంభమైన
సంప్రదాయ సంగీతం నేడు
ప్రపంచమంతా విస్తరించడం
భారత దేశానికి గర్వకారణం

సంగీత శైలులు భావోద్వేగాలను
సంస్కృతి సాంప్రదాయాలను
అర్థంచేసుకోవడానికి
సాధనంగా పనిచేస్తాయి

సంగీతం వినోదాన్ని
శాంతిని ఆనందాన్ని
మనసును శాంత పరిచే
శక్తివంతమైన వారధి
మనుషుల మధ్య
బంధాలను పెంచుతుంది

హిందుస్తానీ కర్ణాటక సంగీత
శైలులు ప్రపంచంలో భారత్ కు
ఎంతో గౌరవం తెచ్చాయి

త్యాగరాజు అన్నమయ్య
మొజార్డ్ జాబ్ మార్లీ
సంగీత ప్రపంచంలో
చిరస్మరణీయమైన
విద్వాంసులను స్ఫూర్తిగా
తీసుకోవాలి
కర్ణాటక సంగీతంలో
విశేషమైనకృషి చేసిన
భారత రత్న ఎమ్మెస్
సుబ్బలక్ష్మి కర్ణాటక
సంగీతంలో ధ్రువతారగా
వెలుగొందడం భారత్ కు
గర్వకారణం

సంగీతం మానవ జీవితంపై
ఎక్కువ ప్రభావం చూపిస్తుంది
మనసుకు ప్రశాంతత చేకూర్చి
ప్రపంచ ప్రజలను ఏకంచేసే
విశ్వ వ్యాప్త భాష సంగీతం

సంగీతం ద్వారా మనిషి
భావలను వ్యక్తపరుస్తాడు
సంగీతం భాషా జాతి
కులమత భేదాలకు
అతీతంగా అందరు
ఆస్వాదిస్తారు

ఒత్తిడి నిరాశను తగ్గిస్తుంది
విద్యా సంస్కృతి అభివృద్ధిలో
సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది
శాంతి సౌభ్రాతృత్వం సహనం
సంయమనం సంఘీభావాన్ని
పెంపొందిస్తుంది

సంగీతం యువతలో
ఆశావహ దృక్పదాన్ని
ఉద్దీపనం చేస్తుంది

యువతలో సంగీతం
పట్ల ఆసక్తిని పెంచాలి
విద్యా ప్రణాళికల్లో

సంగీతాన్ని పాఠ్యాంశంగా
ప్రవేశపెట్టడానికి
ప్రభుత్వాలు సమగ్ర
కార్యాచరణకు
పూనుకోవాలి

హింసా రహిత సమాజ స్థాపన
ప్రజల శాంతియుత జీవనశైలికి
సంగీతం గొప్ప వారిది
సంగీతానికి సమయం
కేటాయిద్దాం
ఆనందాన్ని ఆస్వాదిద్దాం
మానసిక ఆరోగ్యాన్ని
సంరక్షించుకుందాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
నాష్వెల్లి 'టెన్నసి
యు'ఎస్ 'ఏ
9440245771

# అరేబియా సముద్రం లో తొలి తుఫాను.. 'సైక్లోన్ శక్తి' గా నామకరణం

న్యూ ఢిల్లీ అక్టోబర్ 3;ఈ ఏడాది అరేబియా సముద్రం లో తొలి తుఫాను ఏర్పడింది. భారత వాతావరణ విభాగం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఈశాన్యం వైపు ద్వారకకు 240 కిలోమీటర్ల దూరంలో, పోరుబందర్‌కు 270 కిలోమీటర్ల దూరంలో అల్పపీడనం ఏర్పడింది.అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తుఫానుగా మారింది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ తుఫాను కు 'సైక్లోన్ శక్తి' గా నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం.. హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు ఈ తీరంలో ఏర్పడే తుఫానులకు పేర్లను నిర్ణయిస్తాయి.భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ దేశాలు తుఫాన్‌లకు పేర్లు పెడుతాయి. కొన్ని తుఫానుల ప్రభావం చాలారోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుఫాను వస్తే ఎక్కడ ఏ తుఫాను ప్రభావం అనే విషయంలో తికమక లేకుండా ఉండటం కోసం తుఫానులకు పేర్లుపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు.తాజా తుఫానుకు 'శక్తి' అనే పేరును శ్రీలంక పెట్టింది. తుఫానులకు పేర్లు పెట్టడం ద్వారా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుఫాను చెప్పడం, అర్థం చేసుకోవడం సులువు అవుగుంది. అయితే తుఫానులకు పెట్టే పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉన్నది.కాగా ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుఫాను హెచ్చరిక కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు తుఫానులకు సంబంధించి సూచనలు, సమాచారం ఇస్తుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణ కేంద్రం కూడా ఒకటిగా పనిచేస్తోంది.అక్షర క్రమాన్ని అనుసరించి ఒక్కో దేశం ఒక్కో తుఫానుకు పేరును సూచిస్తాయి. ప్రతిసారి ఆ పేరు కొత్తగా, మళ్లీ పునరావృతం కాకుండా ఉండాల్సి ఉంటుంది. తుఫానులకు పేర్లు పెట్టే విషయంలో పలు నిబంధనలు ఉన్నాయి. 'తుఫాను పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు' అనేవి ప్రధాన నిబంధనలుగా ఉన్నాయి.

# పొద్దు తిరుగుడు విత్తనాలు తినడం వాళ్ళ అనేక లాభాలు

హైదరాబాద్ అక్టోబర్ 3 ;సాయంత్రం సమయంలో చాలా మంది చిరుతిళ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. బయట రహదారుల పక్కన బండ్లపై లేదా ఫుడ్ కోర్టులు వంటి వాటిల్లో సమోసాలు, బజ్జీలు, పునుగులతోపాటు బేకరీలలో వివిధ రకాల ఆహారాలను సాయంత్రం సమయంలో స్నాక్స్ లా తింటుంటారు. అయితే ఇవి మన ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేలా చేస్తాయి. కనుక ఈ ఆహారాలను తినకూడదు. సాయంత్రం సమయంలో ఆకలి అయితే ఆరోగ్యవంతమైన స్నాక్స్‌ను తినాల్సి ఉంటుంది. ఇవి ఆకలిని తీర్చడమే కాదు, మనకు పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇక అలాంటి ఆరోగ్యవంతమైన స్నాక్స్‌లో పొద్దు తిరుగుడు విత్తనాలు కూడా ఒకటి. చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

హైబీపీ తగ్గేందుకు..

పొద్దు తిరుగుడు విత్తనాల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులతోపాటు ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఈ విత్తనాలను తింటే మెదడు పనితీరు మెరుగు పడుతుంది. కణాల నిర్మాణం సరిగ్గా జరుగుతుంది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ కొవ్వులతోపాటు ఈ విత్తనాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు ఎంతో మేలు చేస్తాయి. ఇవి మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. బీపీ తగ్గేలా చేస్తాయి. ఈ విత్తనాల్లో ఉండే మెగ్నిషియం గుండె వేగంగా కొట్టుకోవడాన్ని తగ్గిస్తుంది. దీంతో హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి..

పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కారణంగా మనం తినే ఆహారాల్లో ఉండే పిండి పదార్థాలు రక్తంలో గ్లూకోజ్‌గా నెమ్మదిగా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్



అమాంతం పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ఈ విత్తనాల్లో జింక్, సెలీనియం, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలు రాకుండా ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకం తగ్గేలా చేస్తుంది. ఈ విత్తనాల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి ఈ విత్తనాలను చక్కని ఆహారంగా చెప్పవచ్చు. ఈ విత్తనాలను తింటే ప్రోటీన్లు లభించి శరీరానికి శక్తి అందుతుంది. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గిపోతాయి.

ఎలా తినాలి..?

గుప్పెడు పొద్దు తిరుగుడు విత్తనాలను తింటే సుమారుగా 165 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 5.5 గ్రాములు, కొవ్వులు 14.4 గ్రాములు, పిండి పదార్థాలు 6.5 గ్రాములు, ఫైబర్ 3 గ్రాములు ఉంటాయి. అలాగే విటమిన్ ఇ, మెగ్నిషియం, సెలీనియం, జింక్, కాపర్ కూడా ఈ విత్తనాల్లో అధిక మొత్తాల్లో ఉంటాయి. పొద్దు తిరుగుడు విత్తనాలను గుప్పెడు మోతాదులో తినవచ్చు. అధికంగా తింటే వికారం, వాంతికి వచ్చినట్లు అనిపించడం, పొట్టలో అసౌకర్యంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ విత్తనాలను నేరుగా తింటే వికారంగా అనిపిస్తుంది. కనుక పెనంపై కాస్త వేయించి తింటే మంచిది. పొద్దు తిరుగుడు విత్తనాలను సాయంత్రం సమయంలో స్నాక్స్‌లా తినవచ్చు. లేదా రాత్రి నిద్రకు ముందు తినవచ్చు. ఉదయం వ్యాయామం చేసిన తరువాత కూడా తినవచ్చు. ఇలా ఈ విత్తనాలను రోజూ తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# నాట్యం బిశక్తివంతమైన ఆరోగ్య సాధనం

నాట్యం ప్రపంచ ప్రజలను
ఏకం చేసే సాంస్కృతిక
సాధనం

నాట్యానికి మత
ప్రాంత సాంస్కృతిక
అడ్డంకులుండవు

ఎల్లలు ఎరగనిది
ప్రపంచం లోని విభిన్న
జాతులను సమన్వయ
పరిచే సాధనం

నాట్యం శక్తివంతమైన
ఆరోగ్య సంపద
నాట్య సాధన
అద్భుతమైన
అనుభూతినిచ్చి
అమితానందాన్ని
అందిస్తుంది

కళాభిమానులకు
మానసిక ప్రశాంతతను
చేకూర్చుతుంది

నాట్య కళా
ఆనందాలను
పంచుతూ
మానసికోల్లాసానికిజి
శరీర దృఢత్వానికి
మానవ ఆరోగ్యాన్ని
పెంచుతూ
మనసుకు
హృదయానికి
ఆత్మకు
ఆరోగ్యాన్నిస్తుంది

నాట్యంతో వ్యక్తిగత
అభినయం శరీర
సౌష్ఠత శరీర భాగాల
సమన్వయం
జరిగి భావోద్వేగాలను
ఆకర్షణీయంగా
వ్యక్తీకరించడంతో
మానసిక ఒత్తిడిని
తగ్గిస్తుంది
30 నిమిషాల డ్యాన్స్
అరగంట జాగింగుతో
సమానం

నాట్యం భిన్నత్వంలో
ఏకత్వానికి ప్రతీక
భారతంలో శాస్త్రీయ
జానపద నాట్యాలు
ప్రజాదరణ పొందాయి

భారతదేశంలో
భరతనాట్యం'
కూచిపూడి' మణిపురి
ఒడిసి 'మోహిని యాట్టం'
కథక్ మొదలగు నాట్య
రీతులున్నాయి

దేశంలో 29 జానపద
కళారూపాలు ఉనికిలో
ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాలలో
భామాకలాపం' విలాసిని'
వీర నాట్యం' బుట్ట బొమ్మలు
బోనాలు 'బుర్రకథ : చిందుల



బాగోతం పగటి వేషగాళ్ళు
గుస్సాడి గిరిజన నృత్య
కళారూపాలు విశేష
ప్రచారంలో ఉన్నాయి

ప్రభుత్వాలు పౌరసమాజం
నాట్య కళలో యువతను
ప్రోత్సహించాలి

నాట్య శిక్షణ
సదుపాయాలు
కల్పించాలి
నాట్యకళను వారసత్వ

సంపదను రాబోయే
తరాలకు అందించాలి

సమాజానికి ఉల్లాసాన్ని
ఉత్సాహాన్ని ఇచ్చే
నాట్య కళా రీతులను
సమాజం ఆదరించాలి

ప్రభుత్వాలు
నాట్య కళను
విద్యాసంస్థల్లో
పాఠ్యాంశంగా
ప్రవేశపెట్టాలిజి
నాట్యాన్ని ఆదరిద్ధాం
ఉల్లాస ఉత్సాహ
భవితకు
ఉద్యుక్తులమౌదాం

నేదునూరి కనకయ్య
కాలమిస్ట్' ఇండిపెండెంట్ జర్నలిస్టు
'అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్ 9440245771

# వయోవృద్ధులు పోషణ సంరక్షణ చట్టం

## (సీనియర్ సిటిజన్స్ చట్టం) అమలుకుప్రత్యేక అధికారిని నియమించాలి

ప్రపంచ వృద్ధుల దినోత్సవం
( అక్టోబర్ 1) సందర్భంగా)
నేదునూరి కనకయ్య రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఎకానమిక్ ఫోరం

కొడుకుల 'బిడ్డల నిరాదరణకు గురౌతున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2007 లో తల్లి తండ్రుల వయోవృద్ధుల పోషణ' సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యునల్ కమిటీ ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధుల సమస్యల పరిష్కారం' సంక్షేమం 'హక్కుల రక్షణ కొరకు నియమావళిని రూపొందించారు. కమిటీకి "ఛైర్మెన్ గా" రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి వ్యవహరిస్తారు జిల్లా వికలాంగుల సహాయ సంచాలకులు 'వయోవృద్ధులు శాఖ సహాయ సంచాలకులు కన్వీనర్లుగా స్వచ్ఛంద సంస్థల నుండి ఒకరు లేదా ఇద్దరు ప్రతినిధులు వుంటారు . ఈ కమిటీకి కోర్టుకు వుండే అధికారాలు వుంటాయి. కమిటీ తల్లి తండ్రుల కేసులు విచారించి 90 రోజుల్లో తీర్పులు ఇస్తాయి. కాని క్షేత్ర స్థాయిలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఆశించిన విధంగా జరగడం లేదు. రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి తన రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం వల్ల సమయం లేక పోవడం వల్ల వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోని స్థితి. దాపురించింది. రాష్ట్రంలో వృద్ధులను బెదిరించి వారి ఆస్తులను తమ పేరు మీద రాయించుకోవడం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఒంటరి వృద్ధులు ఆస్తులు కోల్పోయి బజారున పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు ఒంటరి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు పథకాలు ప్రవేశ పెట్టడం అభినందనీయం కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యులైన వయోవృద్ధుల సంక్షేమం వారి హక్కుల రక్షణకు సమగ్రమైన చర్యలు చేపట్టాలి.

వయోవృద్ధుల ఆస్తులు రాయించుకొని వారిని ఇంటి నుండి బైటకు గెంటి వేస్తున్నారు. వృద్ధా శ్రమల్లో చేర్పిస్తు న్నారు. బలవంతంగా వృద్ధుల చేత ఆస్తులు రాయించుకున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆస్తి విక్రయానికి సంబంధించిన సొమ్ము వృద్ధుని ఖాతాలో జమ ఆయినా విషయం రూఢి చేసుకుని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులు నిరక్షరాస్యులు వారికి బ్యాంక్ ఖాతాలు ఉండవు. డివిజన్ స్థాయి అధికారులు తమ రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతల్లో తీరిక లేకుండా వుండం వల్ల.వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

మండల స్థాయిలో సీనియర్ సిటిజన్స్ చట్టం అమలుకుప్రత్యేక అధికారిని నియమించాలి.లి

ప్రభుత్వం ప్రతి మండల స్థాయిలో వయోవృద్ధులు సమస్యలు పరిష్కారం సంక్షేమం హక్కుల రక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి.

**గ్రామసభ ' సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన కల్పించాలి**

గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామంలోని వృదుల సంఖ్య పై సర్వే నిర్వహించాలి.


గ్రామసభలో వయోవృద్ధుల పోషణ 'సంక్షేమం 'హక్కుల రక్షణ' సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి.వృద్ధుల ఆరోగ్యం సంక్షేమం అభివృద్ధి పథకాల మీధచర్చ జరగాలి. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వయోవృద్ధుల జనాభా సేకరించి ప్రతి నెల వృద్ధుల కొరకు ఉచిత విద్య ఆరోగ్య శిబిరంనిర్వహించాలి. ప్రతి గ్రామములో మహిళా సంఘాలు 'తల్లుల కమిటీలు మాదిరి వయోవృద్ధుల కమిటీ ఏర్పాటు చేయాలి. వయోవృద్ధులు సంక్షేమం కమిటీలుగా ఏర్పడాలి..

**సీనియర్ సిటిజన్స్‌బి చట్టాలు బిమీడియా ప్రచారం చెయ్యాలి**

కేంద్రం వయోవృద్ధులు సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన టోల్ ఫ్రీ నెంబర్14567 మీధ విస్తృత ప్రచారం చెయ్యాలి .మీడియా 'ప్రసార మాధ్యమాలు 'ఎలక్ట్రానిక్ మీడియా క్రియా శీల పాత్ర పోషించాలి.కేంద్ర ప్రభుత్వం 2007 లో ప్రవేశ పెట్టిన తల్లి తండ్రుల వయోవృద్ధులు పోషణ సంక్షేమం సంరక్షణ చట్టం మీధ వృద్ధులకు అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.

గ్రామాల్లో వయో వృద్ధులను బెధిరించి ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేసి కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు జరిమానాలు విధించి తిరిగి వయోవృద్ధుల ఆస్తిని వారి పేరు మీద రిజిస్టర్ చెయ్యాలి.

సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొనే సమస్యలు జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికార్లకు నివేదించాలి. వృద్ధులను మానవ వనరుల అభివృద్ధికి సారథులుగా సమాజం ప్రభుత్వం గుర్తించాలి.



నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సమాజ ఆర్థిక అధ్యయన వేదిక
మాజీ కరెస్పాండెంట్ జస్టిస్
కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
9440245771

# పాక్ ప్లేయర్ల వంకరబుద్ధి.. మహిళల ప్రపంచకప్‌లో 'కశ్మీర్' వివాదం



ఆసియా కప్‌లో భారత్‌ను రెచ్చగొట్టేలా పాకిస్థాన్ ఆటగాళ్లు ప్రవర్తించిన తీరు పెను వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైనప్పటికీ పాక్ ప్లేయర్ల బుద్ధి మాత్రం మారలేదు. తాజాగా మహిళల ప్రపంచకప్ టోర్నీ లో పాక్ మాజీ కెప్టెన్ సనా మిర్ చేసిన వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. మ్యాచ్ మధ్యలో కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించేలా ఆమె చేసిన కామెంట్రీపై నెట్టింట విమర్శలు వెల్లువెత్తాయి. అసలేం జరిగిందంటే..

మహిళల ప్రపంచకప్ టోర్నీలో భాగంగా అక్టోబరు 2న కొలంబో వేదికగా పాక్, బంగ్లాదేశ్ ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో సనా మిర్ కామెంటేటర్‌గా వ్యవహరించింది. పాక్ క్రీడాకారిణి నటాలియా పర్వేజ్ బ్యాటింగ్‌కు వస్తుండగా ఆమెను ఉద్దేశిస్తూ మిర్ రాజకీయపరమైన వ్యాఖ్యలు చేసింది. "నటాలియా ఆజాద్ కశ్మీర్ (పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఉద్దేశిస్తూ)కు చెందిన అమ్మాయి. లాహోర్‌కు వచ్చి క్రికెట్‌లో రాణిస్తోంది" అంటూ సనా మిర్ కామెంట్రీ చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో ఆమెపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 29 ఏళ్ల నటాలియా పర్వేజ్ స్వస్థలం భీంబర్ జిల్లా. ఇది పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉంది. పీఓకేను 'ఆజాద్ కశ్మీర్' అని పేర్కొంటూ సనా మిర్ కామెంట్రీ చేసింది. దీంతో భారత నెటిజన్లు ఆమెపై ధ్వజమెత్తారు. "ఆజాద్ కశ్మీర్ అని మాట్లాడే ఇలాంటి ఆటగాళ్లా.. రాజకీయాలను క్రీడలకు దూరంగా ఉంచాలంటూ మనకు నీతులు చెప్పేది" అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. సోషల్‌మీడియాలో తనపై విమర్శలు రావడంతో సనా మిర్ స్పందించింది. రాజకీయ కోణంలో తాను ఈ వ్యాఖ్యలు చేయలేదని, కేవలం నటాలియా పడిన కష్టాలను చెప్పే క్రమంలోనే ఆ పదాన్ని వాడానంటూ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. అయిత్తే, క్షమాపణలు మాత్రం చెప్పకపోవడం గమనార్హం.



# ఎంఎస్ ధోనితో సమంగా నిలిచిన జడేజా..

అహ్మదాబాద్ వేదికగా భారత్, వెస్టిండీస్ జట్లు మొదటి టెస్ట్ మ్యాచ్ ఆడుతున్నాయి. రెండో రోజు ఆటలో టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా) అర్ధశతకం సాధించాడు. అలాగే ఓ మైలురాయికి చేరుకున్నాడు. టెస్ట్ మ్యాచుల్లో సిక్స్‌ల విషయంలో టీమ్‌ఇండియా బ్యాటర్లలో ఎంఎస్ ధోని) సరసన నిలిచాడు. జడేజా ఈ మ్యాచ్‌లో కరేబియన్ బౌలర్ జోమెల్ వారికన్ బౌలింగ్‌లో కళ్లు చెదిరే సిక్స్ బాదాడు. ఇది అతడి టెస్ట్ కెరీర్‌లో 78లివ సిక్స్. ధోని కూడా సరిగ్గా ఇన్ని సిక్స్‌లే కొట్టాడు. భారత బ్యాటర్లలో.. రోహిత్ శర్మ (88), రిషభ్‌పంత్ (90లి), వీరేంద్రసెహ్వాగ్ (91) మాత్రమే ముందున్నారు. వీరిలో రిషభ్ పంత్ ఒక్కడే టెస్ట్ క్రికెట్‌లో కొనసాగుతున్నాడు

# ప్రేక్షకులు లేక మైదానం వెల వెల



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా టీమ్‌ఇండియా వెస్టిండీస్ జట్లు తలపడుతున్నాయి. ప్రస్తుతం మొదటి టెస్ట్ రెండో రోజు ఆట కొనసాగుతోంది. అయితే మైదానంలో మ్యాచ్‌ను వీక్షించే అభిమానులు కరవయ్యారు. దీంతో ప్రేక్షకులు లేక స్టేడియం వెలవెలబోతోంది.

ఈ మ్యాచ్ నిన్న (గురువారం) ప్రారంభమైంది. నేషనల్ హాలిడే (గాంధీ జయంతి, విజయ దశమి) అయినప్పటికీ చెప్పుకోదగ్గ స్థాయిలో ఫ్యాన్స్ మైదానానికి రాలేదు. అలాగే ఈరోజు (శుక్రవారం) కూడా స్టాండ్స్‌లో ఖాళీ సీట్లే దర్శనమిస్తున్నాయి. స్టేడియంలో టెస్ట్ మ్యాచ్‌లను చూడ్డానికి ప్రేక్షకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో అభిమానులు విరాట్ కోహ్లీ గతంలో చేసిన వ్యాఖ్యలను ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

'నా ఉద్దేశం ప్రకారం కేవలం అయిదు వేదికల్లోనే టెస్ట్ మ్యాచ్‌లు నిర్వహించాలి. టీ20, వన్డే మ్యాచ్‌లను ఏ వేదికల్లోనైనా నిర్వహించొచ్చు. కానీ టెస్ట్ మ్యాచ్‌లను మాత్రం ఎంపిక చేసిన అయిదు మైదానాల్లోనే నిర్వహించాలి. అప్పుడు మ్యాచ్‌లను వీక్షించడానికి జనాలు ఎక్కువ సంఖ్యలో వస్తారు' అని విరాట్ కోహ్లీ 2019లో రాంచీ టెస్ట్ తర్వాత అన్నాడు.



# భారీ ఆధిక్యం దిశగా భారత్..

## టీ బ్రేక్: టీమ్‌ఇండియా స్కోర్ 326/4

అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా టీమ్‌ఇండియా, వెస్టిండీస్ జట్లు తొలి టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతున్నాయి. భారత జట్టు భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. 121/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమ్ ఇండియా.. టీ బ్రేక్ సమయానికి 96 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. ప్రస్తుతం టీమ్‌ఇండియా 164 పరుగుల ఆధిక్యంలో ఉంది.

**కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ..**

భారత ఓపెనర్.. కేఎల్ రాహుల్ అద్భుత సెంచరీతో తన సత్తా చాటాడు. తొలి రోజు హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అతడు రెండో రోజు ఆటలో లంచ్‌కు కొన్ని నిమిషాల ముందు శతకం (100, 190 బంతుల్లో, 12 ఫోర్లు) సాధించాడు. టెస్టుల్లో అతడికిది 11వ సెంచరీ. సొంతగడ్డపై మాత్రం ఇది తనకు రెండో సెంచరీ. స్వదేశంలో చివరిసారిగా 2016లో చెన్నై వేదికగా ఇంగ్లాండ్‌పై శతకం నమోదు చేశాడు. అయితే లంచ్ తర్వాత తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన కేఎల్ రాహుల్ తన స్కోరుకు పరుగులేమీ జోడించకుండానే, వెంటనే పెవిలియన్‌కు చేరాడు. అంతకు ముందు శుభ్‌మన్ గిల్ సరిగ్గా 50 పరుగుల వద్ద (100 బంతుల్లో) ఔటయ్యాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురేల్ అర్ధశతకం (68లిబీ 126 బంతుల్లో, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సాధించాడు.

**రాణించిన జడేజా..**

మరోవైపు రవీంద్ర జడేజా సైతం అర్ధ శతకం (50లిబీ 81 బంతుల్లో, 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) సాధించాడు. జడేజా, జురేల్.. అయిదో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని (108బీ 169 బంతుల్లో) నెలకొల్పారు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ 2, జైడెన్ సీల్స్, జొమెల్ వారికన్ తలో వికెట్ సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ బ్యాటింగ్‌లో విఫలమైన విషయం తెలిసిందే. దీంతో ఆ జట్టు 44.1 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. కరేబియన్ బ్యాటర్లలో జస్టిన్ గ్రీవ్స్ (32, 48 బంతుల్లో, 4 ఫోర్లు), షై హోప్ (26, 36 బంతుల్లో, 3 ఫోర్లు), రోస్టన్ చేజ్ (24, 43 బంతుల్లో, 4 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు.

# రజత పతకం కైవసం చేసుకున్న మీరాబాయి చాను



మీరాబాయి చాను మూడేళ్ల విరామం తర్వాత నార్వేలోని ఫోర్డ్‌లో వెయిట్ లిఫ్టింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని తన సత్తా చాటింది. మహిళల 48 కిలోల విభాగంలో తృటిలో స్వర్ణాన్ని కోల్పోయి, రజతంతో ముగించింది. మీరాబాయి.. స్నాచ్‌లో తన మొదటి ప్రయత్నంలోనే 84 కిలోలు ఎత్తింది. అయితే, తర్వాత రెండు లిఫ్ట్‌లను 87 కిలోల వద్ద తడబడింది. దీంతో ఆమె పోడియం ఫినిషింగ్ కోసం పోటీలో ఉండటానికి క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కిలోలకు పైగా ఎత్తాల్సివచ్చింది. అయితే.. మీరాబాయి క్లీన్ అండ్ జెర్క్‌లో రాణించింది, 109 కిలోల దృఢమైన బరువుతో ప్రారంభించి, 112 కిలోలకు మెరుగుపడి, 115 కిలోల లిఫ్ట్‌తో ముగించింది. ఈవిధంగా ఆమె మొత్తం 199 కిలోల బరువు ఎత్తి రజతం సొంతం చేసుకుంది. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్-గమ్ 213 కిలోలు ఎత్తి వరల్డ్ రికార్డు సాధించి, బంగారు పతకాన్ని గెలుచుకుంది.

మీరాబాయికి 2022 ఎడిషన్‌లో విజయం తర్వాత ప్రస్తుతమిది రెండో రజత పతకం. మొత్తం మీద, ఈ ఈవెంట్‌లో ఇది ఆమెకు మూడో పతకం. 2017లో జరిగిన ఈ ఈవెంట్‌లో ఆమె బంగారు పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా ఆమెకు ఇది 14వ అంతర్జాతీయ పతకం. తన ఖాతాలో.. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, కామన్వెల్త్ క్రీడల్లో మూడు పతకాలు (2018, 2022లో స్వర్ణం, 2014లో రజతం), కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో అయిదు (నాలుగు స్వర్ణాలు, ఒక రజతం), 2020 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఒక కాంస్య పతకం, 2016 దక్షిణాసియా క్రీడల్లో ఒక స్వర్ణం ఉన్నాయి.

# ఆ ట్యాగ్ మాకు మేం ఇచ్చుకోలేదు: రషీద్ ఖాన్



రషీద్ ఖాన్ () కెప్టెన్సీలో అఫ్గానిస్థాన్ ఆసియా కప్‌లో ) పాల్గొంది. అయితే ఎన్నో అంచనాల మధ్య టోర్నీలో పాల్గొన్న ఆ జట్టు గ్రూప్ స్టేజీలోనే ఇంటి ముఖం పట్టింది. బంగ్లాదేశ్, శ్రీలంక చేతిలో ఓటమి పాలవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. అయితే ఈ టోర్నీకి ముందు అఫ్గానిస్థాన్ జట్టును ఆసియాలో రెండో బెస్ట్ టీమ్ అని పలువురు క్రికెట్ విశ్లేషకులు అన్నారు. అయితే ఈ ట్యాగ్ మాకు మేం ఇచ్చుకోలేదు


. అభిమానులు, మీడియా ఇచ్చారని రషీద్ ఖాన్ విలేకరుల సమావేశంలో అన్నాడు.

'అఫ్గానిస్థాన్ జట్టు ఆసియాలోనే రెండో అత్యుత్తమ జట్టు అనే వార్త ఈ మధ్య మీడియాలో చక్కర్లు కొట్టింది. అభిమానులూ అన్నారు. కానీ మేం ఆ మాట ఎప్పుడూ చెప్పలేదు. అయితే గతంలో మేం చక్కగా ఆడాం. అందుకే మాకు ఆ ట్యాగ్ దక్కింది. ఆసియా కప్, టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్స్, వన్డే వరల్డ్‌కప్‌లో మేం పెద్ద జట్లతో తలపడ్డాం. ఛాంపియన్స్ ట్రోఫీలో మేం ఇంగ్లాండ్‌ను ఓడించాం. అందుకే మాకు ఈ ట్యాగ్ వచ్చింది.

ఒక వేళ భవిష్యత్తులో మేం సరిగా ఆడకుంటే.. మమ్మల్ని నంబర్ 3, 4, 5, 6 అని కూడా అంటారు. మేం మాకు ఆ ట్యాగ్‌లు రావడాన్ని ఇష్టపడం. మేం సాధ్యమైనంత వరకు మా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. కొన్ని సార్లు చక్కగా ఆడతాం. మరికొన్ని సార్లు మెరుగైన ప్రదర్శన చేయలేం. ఇదంతా ఆటలో భాగమే. కానీ ఎప్పుడూ పాజిటివ్ మైండ్‌సెట్‌తోనే ముందుకు సాగాలి. నిజాయతీగా చెప్పాలి అంటే.. ఈ మధ్య మేం ఓ జట్టుగా తగినంత టీ20 క్రికెట్ ఆడలేదు' అని రషీద్ ఖాన్ పేర్కొన్నాడు.

యూఏఈ వేదికగా నేటి నుంచి (గురువారం) అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య మూడు టీ20లు, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనున్నాయి.

"నాకు ఇండస్ట్రీలో చిరంజీవి( ఆదర్శం. ఆయన చాలా కష్టపడతారు. 'అత్తకు యముడు.. అమ్మాయికి మొగుడు' సినిమాలో మెరుపులా.. సాంగ్‌కు కొరియోగ్రఫీ అందించాను. అప్పుడు ఆయన డ్యాన్స్ మూమెంట్స్ చూసి ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత ఆయన వీడియోలు చూసి వామ్మో అనుకున్నాను. నాకు ఈరోజు ఇంత గుర్తింపు వచ్చిందంటే చిరంజీవే కారణం. టాలెంట్ ఉంటే ఆయన కచ్చితంగా ప్రోత్సహిస్తారు.



# ఇంత గుర్తింపు వచ్చిందంటే చిరంజీవే కారణం: ప్రభుదేవా

: తనకు చిరంజీవి ఆదర్శమని కొరియోగ్రాఫర్ ప్రభుదేవా అన్నారు. జగపతిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా' ( ఇప్పటికే పలువురు సినీతారలు ఈ కార్యక్రమంలో సందడి చేయగా తాజా ఎపిసోడ్‌కు ప్రభుదేవా అతిథిగా హాజరయ్యారు. తన బాల్యం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

"నాకు హిప్‌అప్, బ్రేక్ డ్యాన్స్.. ఇలా రకరకాల డ్యాన్స్‌లు తెలియవు. నాకు తెలిసింది నా డ్యాన్స్ మాత్రమే. నాకు వచ్చిన దాన్ని ప్రేక్షకులకు అందిస్తాను. మా వంశంలో చాలామంది డ్యాన్సర్లు ఉన్నారు. మా అబ్బాయి రిషికి రెండేళ్ల ముందువరకూ ఈ రంగంపై ఆసక్తి లేదు. రెండేళ్ల క్రితం సడన్‌గా 'నేను యాక్టర్ అవుతాను' అన్నాడు. ఆ మాటకు నేను ఆశ్చర్యపోయాను. ఇండస్ట్రీ చాలా గొప్పది. కానీ, ఇందులో నిలబడాలంటే చాలా కష్టం. అప్పటివరకూ చిన్న పిల్లాడిలా ఉన్న మా అబ్బాయి నేను యాక్టర్ అవుతాను అని చెప్పినప్పుడు నిజంగా షాకయ్యాను. చదువు పూర్తిచేయమని చెప్పా. ముందు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేస్తే ఇండస్ట్రీ వాతావరణం అలవాటు అవుతుందని షూటింగ్‌కు పంపాను."

"నాకు ఇండస్ట్రీలో చిరంజీవి( ఆదర్శం. ఆయన చాలా కష్టపడతారు. 'అత్తకు యముడు.. అమ్మాయికి మొగుడు' సినిమాలో మెరుపులా.. సాంగ్‌కు కొరియోగ్రఫీ అందించాను. అప్పుడు ఆయన డ్యాన్స్ మూమెంట్స్ చూసి ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత ఆయన వీడియోలు చూసి వామ్మో అనుకున్నాను. నాకు ఈరోజు ఇంత గుర్తింపు వచ్చిందంటే చిరంజీవే కారణం. టాలెంట్ ఉంటే ఆయన కచ్చితంగా ప్రోత్సహిస్తారు. 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమాలో 'అబ్బనీ తీయనిదెబ్బ..' కొరియోగ్రఫీలో మా నాన్నతో పాటు నేనూ భాగమే. అప్పుడు నా వయసు 15 ఏళ్లు. ఏమీ తెలియదు. స్టెప్స్ నేర్పించడం.. నా పని నేను చేసుకోవడం అంతే" అని ప్రభుదేవా అప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు.

'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమాలో 'అబ్బనీ తీయనిదెబ్బ..' కొరియోగ్రఫీలో మా నాన్నతో పాటు నేనూ భాగమే. అప్పుడు నా వయసు 15 ఏళ్లు. ఏమీ తెలియదు. స్టెప్స్ నేర్పించడం.. నా పని నేను చేసుకోవడం అంతే" అని ప్రభుదేవా అప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు.



# ఎట్టకేలకు పెళ్లి చేసుకోబోతున్న ఎన్టీఆర్ బామ్మర్ది.. ఎప్పుడంటే?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ బామ్మర్ది టాలీవుడ్ యంగ్ హీరో నార్నే నితిన్(%చీఱ్‌ఱఅ చీ్‌ఱఅఅఅ%) అందరికీ సుపరిచితమే. 'మ్యాడ్' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి మంచి సక్సెస్ అందుకోవడంతో పాటు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన ఆయ్, మ్యాడ్-2)వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. వరుస విజయాలతో పాపులారిటీనీ పెంచుకున్న ఆయన 'శ్రీశ్రీశ్రీ రాజావారు'తో ప్రేక్షకులను అలరించాడు. ప్రస్తుతం నార్నే నితిన్ విభిన్న కథలు సెలెక్ట్ చేసుకునే పనిలో పడ్డారు. ఇక ఆయన పర్సనల్ లైఫ్ విషయానికొస్తే.. గత ఏడాది నవంబర్‌లో శివాని అనే అమ్మాయితో ఘనంగా నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున టాలీవుడ్ సెలబ్రిటీలు హాజరై సందడి చేశారు.

ఎంగేజ్‌మెంట్ జరిగిన ఏడాది పూర్తి కావొస్తున్నా నార్నే నితిన్ పెళ్లి డేట్ ప్రకటించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో.. తాజాగా, నార్నే నితిన్-శివా పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు అక్టోబర్ 10న ఏడడుగులు వేయబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ వేడుకలకు సంబంధించిన పనులు ప్రారంభం కాగా.. ఎన్టీఆర్, ప్రణతి ఫుల్ బిజీ అయినట్లు తెలుస్తోంది. ఇక నార్నే నితిన్‌కు కాబోయే భార్య రాజకీయ కుటుంబానికి చెందిన అమ్మాయి అని.. అంతేకాకుండా విక్టరీ వెంకటేష్ కుటుంబానికి సమీప బంధువులని ప్రచారం జరుగుతోంది.

# నాలోనూ దుర్గ... పార్వతి!




%ఖ%: 6-8 చిన్ననాటి దసరా రోజులు తనకెంతో ప్రత్యేకమంటోంది నటి రాశీ ఖన్నా. రామ్‌లీలా మైదానంలో జరిగే రావణ దహన వేడుక.. కంజక్ పూజ కోసం దుర్గా దేవిలా అలంకరించుకున్న క్షణాలు.. అమ్మ చేసే పిండివంటలు.. ఇలా దేవీ నవరాత్రులు బోలెడన్ని జ్ఞాపకాలు పంచిచ్చాయని చెబుతోంది. ఆమె ఈ నెల 17న 'తెలుసు కదా' చిత్రంతో.. ఆ తర్వాత 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది. దసరాని మీ ఇంట్లో ఎలా చేసుకుంటారు. చిన్నప్పుడు ఈ పండగతో మీకున్న జ్ఞాపకాలేంటి?

"నాకు దసరాతో బోలెడన్ని జ్ఞాపకాలున్నాయి. నేను పుట్టి పెరిగిందంతా దిల్లీలోనే. అక్కడ ఈ పండగను చాలా ఘనంగా చేసుకుంటారు. చిన్నప్పుడు దసరా వచ్చిందంటే కుటుంబ సమేతంగా రామ్‌లీలా మైదానానికి వెళ్లే వాళ్లం. అక్కడ జరిగే రావణ దహన వేడుకను చూసి చాలా ఆనందించేదాన్ని. అలాగే ఉత్తరాదిన నవరాత్రుల సమయంలో చేసే కంజక్ పూజ కూడా నాకెంతో ప్రత్యేకం. చిన్నపిల్లల్ని దుర్గాదేవి స్వరూపాలుగా తయారు చేసి.. పెద్దవాళ్లు వాళ్ల కాళ్లను పంచామృతాలతో శుభ్రం చేసి, రకరకాల పిండివంటలతో ప్రసాదం పెట్టి.. ఆశీర్వాదం తీసుకుంటుంటారు. చిన్నప్పుడు ఆ పూజలో పాలుపంచుకోవడం నాకు భలే సరదాగా అనిపించేది. ఈ దసరాకి నా మేనకోడలు మా ఇంటికి వచ్చింది. చిన్నప్పుడు మా ఇంట్లో వాళ్లు నన్ను తయారు చేసినట్లే ఈసారి తనని నేను దుర్గాదేవిలా అలంకరించి.. తన పాదాలను పంచామృతంతో కడిగి ఆశీర్వాదం తీసుకున్నా".

ఈ దీపావళికి 'తెలుసు కదా'తో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఇదెలా ఉంటుంది?

"ఈ సినిమాలో మేము ఓ సున్నితమైన అంశాన్ని స్పృశించాం. అదేంటన్నది తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. ఇది ఇప్పటివరకు చూసిన ప్రేమ కథలకు చాలా విభిన్నంగా ఉంటుంది. నేనైతే ఇలాంటి పాయింట్‌ను ఇంత వరకు ఏ సినిమాలోనూ చూడలేదు. ఈ చిత్రం విడుదలయ్యాక ప్రేమ, పెళ్లి, రిలేషన్‌షిప్.. వీటిలోని హద్దుల గురించి చాలా మాట్లాడుకుంటారు. ఆద్యంతం కడుపుబ్బా నవ్విస్తూనే ఓ చక్కటి సందేశాన్ని చెప్పనున్నాం. ఈ సినిమా చూశాక నిజమైన ప్రేమ అంటే ఏమిటి? వివాహ బంధానికి ఉన్న ప్రాధాన్యత ఏంటి? తెలుసుకుంటారు".

ఇప్పటి వరకు మీరు చాలా ప్రేమ కథల్లో నటించారు. దీంట్లో మీ పాత్ర ఎంత విభిన్నంగా ఉంటుంది?

"దర్శకురాలు నీరజ ఈ కథలోని ప్రతి పాత్రను చాలా అద్భుతంగా తీర్చిదిద్దుకుంది. నాది.. సిద్ధుది, శ్రీనిధిది.. ఇలా ప్రతి ఒక్కరి పాత్రకు కథలో ఎంతో ప్రాధాన్యముంటుంది. నేను ఈ సినిమా ఒప్పుకోవడానికి మరో కారణం సిద్ధునే. ఎందుకంటే కథలో దమ్ములేకుండా తను ఏ చిత్రం అంత తేలికగా ఒప్పుకోడు. ఈ సినిమాలో కొన్ని సీన్స్ చేస్తున్నప్పుడు నిజంగానే నేను చాలా భావోద్వేగానికి గురయ్యా".

'తెలుసు కదా' అంటున్నారు.. సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి గురించి ఎవరికీ తెలియని కొన్ని విషయాలు చెప్పండి?

"సినిమా క్రాఫ్ట్ గురించి పరిపూర్ణంగా తెలిసిన నటులు ఇండస్ట్రీలో కొద్దిమందే ఉన్నారు. అలాంటి వాళ్లలో సిద్ధు జొన్నలగడ్డ ఒకరు. తనకు సినిమా అంటే చాలా పిచ్చి. ఆయన సెట్లో ఎంత సరదాగా ఉంటారో.. నటన విషయంలోనూ అంతే నిబద్ధతతో ఉంటారు. ఆయన్ని 'డీజే టిల్లు' తర్వాత టిల్లుగా అందరూ ఎలా గుర్తు పెట్టుకున్నారో.. ఈ సినిమా తర్వాత వరుణ్‌గానూ అంతే గుర్తుండిపోతాడు. ఇక శ్రీనిధి గురించి చెప్పాలంటే.. తను చాలా ఫన్నీ. మాట్లాడటాన్ని చాలా ఇష్టపడుతుంది. నటిగా ఆమెలోని ఎనర్జీకి కారణం ఇదే అనుకుంటా (నవ్వుతూ). సెట్‌ను ఎప్పుడూ వినోదభరితంగా ఉంచడంలో ముందుంటుంది. ఈ చిత్రంతో అందరూ ఓ కొత్త శ్రీనిధిని చూస్తారు".

పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర అవకాశం ఎలా వచ్చింది? ఆ సినిమా విశేషాలేంటి?

"ఓరోజు దర్శకుడు హరీశ్ శంకర్ ఫోన్ చేసి.. 'పవన్ కల్యాణ్‌తో ఓ సినిమా ఉంది. మీరు చేస్తారా' అని అడిగారు. వెంటనే మరో ఆలోచన లేకుండా చేస్తానని చెప్పేశా. నా ఇన్నేళ్ల కెరీర్‌లో తొలిసారి కథ వినకుండా నేను ఓకే చేసిన సినిమా ఇది. ఎందుకంటే చిత్రసీమలోకి వచ్చినప్పటి నుంచి పవన్ కల్యాణ్‌తో కలిసి పని చేయాలన్న కోరిక ఉండేది. అది ఇన్నాళ్లకు నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా పవన్ అభిమానులకు విందు భోజనంలా ఉంటుంది. పవన్ కల్యాణ్ పేరుకు తగ్గట్లే చాలా పవర్‌ఫుల్. ఆయనతో కలిసి పని చేస్తున్నప్పుడు తన వ్యక్తిత్వం ఎంత గొప్పదన్నది ఇంకా బాగా అర్థమవుతుంది.

# నా జీవితంలో ఎప్పుడూ అలా చేయలేదు: పవన్

తాను నటించిన 'ఓజీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గుర్తుచేసుకుంటూ పవన్ కల్యాణ్ ) నవ్వులు పూయించారు. తన జీవితంలో ఎప్పుడూ అలా చేయలేదన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఈ మూవీ సక్సెస్ మీట్ )లో ఆయన మాట్లాడారు. "ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు కటానా పట్టుకుని రావాలని సుజీత్, తమన్ కోరారు. దాన్ని పట్టుకోవడం ఓ సమస్య అయితే, దానికి తోడు వర్షం పడింది. నా జీవితంలో ఇలా ఎప్పుడూ చేయలేదు. అందరూ నాతో ఆడుకుంటున్నారు అని అనుకున్నా (నవ్వుతూ). ఈ వేడుకకు బ్లాక్ డ్రెస్సు, కళ్లజోడు ధరించి, తుపాకీ పట్టుకుని రావాలన్నారు. చంపేస్తా అని చెప్పా. గన్ నా వీక్‌నెస్ అని తెలుసుకుని, ఆడుకుంటున్నారు" అని సరదాగా పేర్కొన్నారు. చిరవకు అభిమానుల కోసమంటూ గన్ పట్టుకుని పవన్ ఫొటో దిగారు.

సుజీత్ ఇప్పటి వరకూ కథ చెప్పలేదు: పవన్


"సినిమాని వేడుకల జరుపుకోవడం అరుదు. అది మాకు సాధ్యమైనందుకు ఆనందంగా ఉంది. దీనికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. కథ చెప్పడం గొప్ప కళ. ఏ సినిమాకైనా కష్టం ఒకేలా ఉంటుంది. కొన్ని సార్లు విజయాలు వస్తాయి. కొన్ని సార్లు రాకపోవచ్చు. సుజీత్‌లో నాకు నేను కనిపిస్తా. ఈ సినిమా కథ అతడు నాకు ఇప్పటి వరకూ చెప్పలేదు. యంగ్ డైరెక్టర్ల గురించి నేను, దర్శకుడు త్రివిక్రమ్ చర్చించుకునే క్రమంలో సుజీత్ ప్రస్తావన వచ్చింది. సుజీత్ ప్రతిభావంతుడని త్రివిక్రమ్ అన్నారు. అలా 'ఓజీ' ప్రయాణం మొదలైంది. సుజీత్ స్టోరీ కన్నా ముందు విజువల్స్ చూపించేవాడు. కెరీర్ ప్రారంభంలో నా మైండ్ కూడా విజువల్స్‌తో నిండిపోయేది. మేకింగ్ గురించి ఎవరికైనా చెబితే.. 'నువ్వే కొత్త.. నువ్వేం చేస్తావ్' అనేవారు. నేను షార్ట్‌ఫిల్మ్స్ చేసేవాడిని. సుజీత్‌లో ఎంతో మ్యాటర్ ఉందిగానీ పైకి చెప్పలేకపోయేవాడు. ఈ సినిమా విషయంలో నాకు ఎలివేషన్ గురించి కాదు ఓ తండ్రి కథ చెప్పాడు"

"జాని' ఫెయిల్యూర్ కాబట్టి దాని రిఫరెన్స్ 'ఓజీ'లో పెట్టడంతో టెన్షన్ పడ్డా. కానీ కొన్ని సార్లు నమ్మి, ముందుకెళ్లిపోవడమే. ఏ సినిమా విజయానికైనా సమష్టి కృషే కారణం. ఎలాంటి బరువు లేకుండా ఈ సినిమాలో నటించా. తమన్ నాకెప్పటి నుంచో తెలుసు. 'ఓజీ'కి అద్భుతమైన సంగీతం ఇచ్చాడు" అని కొనియాడారు.

పవన్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా సినిమా సెప్టెంబరు 25న విడుదలైన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల్లోనే రూ.252 కోట్లకుపైగా వసూలు చేసి, రూ.300 కోట్ల కలెక్షన్లకు (%ూ+ జశీశ్రీశ్రీవష్‌ఱశీఅం%) చేరువలో ఉంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో చిత్ర బృందానికి పవన్ జ్ఞాపికలు అందజేశారు.

'ఓజీ'కి సీక్వెల్.. ప్రీక్వెల్: పవన్

"ఇటీవల నేను థియేటర్‌లో 'ఓజీ'ని చూస్తున్న సమయంలో.. సీక్వెల్, ప్రీక్వెల్ చేద్దామని సుజీత్‌కు మాటిచ్చా. కానీ, వాటికి కొన్ని షరతులుంటాయి" అని పవన్ పేర్కొన్నారు.





# జవహర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రావణ దహన వేడుక



ఎల్బీనగర్, అక్టోబర్ 03 (భారత శక్తి): గడిచిన 34 ఏండ్లుగా సరూర్ నగర్ మండల మైదానంలో జవహర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రావణ దహన ఖాండ నిర్వహించడం జరుగుతుంది. దసరా పండుగ సందర్భంగా గురువారం రాత్రి సరూర్ నగర్ మండల మైదానంలో రావణ దహన ఖాండ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీ కృష్ణయ్య, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ సైదిరెడ్డి, ప్రముఖ వ్యాపార వేత్త రెడ్డి బ్రదర్స్ యజమాని ప్రకాష్‌రెడ్డి,సినీ నటులు అనూష, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఆకుల శ్రీవాణి, సభా అధ్యక్షులు రాధా నాగరాజు, సెక్రటరీ దేవేందర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు ఆరుట్ల సురేష్, సిద్ధూ, చిన్న సురేష్, బాలరాజ్ గుప్తా, జంగయ్య ముదిరాజ్, భగవత్ రాజ్ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పాండురంగా రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర జాగృతి అధినేత్రి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కప్పాటి పాండురంగా రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, జాగృతి యొక్క లక్ష్యం సామాజిక తెలంగాణను సాధించడం, ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం,అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని పెంపొందించడం, రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించి, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే వ్యవస్థను నిర్మించడం జాగ్రత్తి యొక్క లక్ష్యమని తెలంగాణ సాధన కోసం అందరం ఐక్యంగా పోరాడి విజయం సాధించామని, ఇప్పుడు సామాజిక తెలంగాణ కోసం పని చేయాలని ఈ సందర్భంగా ఉద్యమకారుడు పాండురంగా రెడ్డిని ఉద్దేశించి అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, ఆత్మ గౌరవంతో కూడిన తెలంగాణ కోసం అధినేత్రి కవితమ్మ ఆదేశించిన విధంగా రాష్ట్రంలో పేదల వైపు వుండి పోరాటం చేస్తూ సామాజిక తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా అధినేత్రి ఆదేశం మేరకు క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తామని, పార్టీని పటిష్టం చేస్తామని అన్నారు.



**హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి ):**
హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహించిన జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజషన్(జీటో) మీటింగ్ లో పాల్గొని ఢిల్లీ బయలుదేరిన కేంద్ర రక్షణ శాఖ మంత్రివర్యులు రాజ్ నాథ్ సింగ్ ని బేగంపేట్ విమానాశ్రయంలో కలసి శాలువాతో సత్కరించిన హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఇతర బీజేపీ కార్పొరేటర్లు.



**హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి):**
నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సందర్భంగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గడ్డం వివేక్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ గౌడ్ మాజీ ఎంపీ వి.హనుమంత్ రావు,స్త్రీ సంక్షేమ అభివృద్ధి కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ శ్రీమతి బంద్రు శోభా రాణి, ప్రజా గాయని శ్రీమతి విమలక్కను కలవడం జరిగింది..



**హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి ):**
శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రివర్యులు రాజ్ నాథ్ సింగ్ కి బేగంపేట విమానాశ్రయంలో పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికిన హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి..

## విజయదశమి వేడుకలో పాల్గొన్న రాక్ టౌన్ వాసులు



ఎల్బీనగర్, అక్టోబర్ 03 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సురాబాద్ డివిజన్ రాక్ టౌన్ కమ్యూనిటీ హాల్ లో అసోసియేషన్ వారు నిర్వహించిన దసరా ఉత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గొన్న రాక్ టౌన్ కాలనీ సభ్యులు పరిసర కాలనీవాసులు. ఈ ఉత్సవాలలో దసరా రోజు జమ్మి పూజతో పాటు ఆయుధ పూజ, పాల పిట్ట దర్శనం, ప్రత్యేకంగా భారీ ఎత్తులో ఉన్న రావణాసుర దహన కార్యక్రమం జరిగింది. ఈ సంవత్సరం నవరాత్రులలో 9 రోజులు మహిళలు బతుకమ్మ/దాండియా, అమ్మవారికి సాయంత్రం మహిళలందరు పారాయణంతో పాటు వివిధ అలంకరణలు చేసారు. ఆలాగే చివరి రోజు దసరా నాడు భారీ సంఖ్యలో పిల్లలు, మహిళలు, (కమిటీ సభ్యులు, కాలనీ సభ్యులు )పెద్దలు పాల్గొని విజయదశమి పండుగను కమిటీ సభ్యులు, కాలనీ సభ్యులందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగిందని రాక్ టౌన్ ప్రెసిడెంట్ ఎర్ర వినోద్ రెడ్డి తెలియజేసారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రాక్ టౌన్ సొసైటీ తరుపున పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. అలాగే విజయదశమి శుభాకాంక్షలు కూడా తెలియజేయడం జరిగింది.



**వికారాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి):**
స్వగ్రామమైన పెద్ద ఉమ్మెంతల గ్రామంలోని పురాతన శివాలయం గుడి పునర్నిర్మాణం కొరకు సుమారు 60 నుండి 70 లక్షల రూపాయలతో గుడిని నిర్మించాలని విజయదశమి నాడు సంకల్ప బద్ధులైన పెద్ద ఉమ్మెంతల గ్రామ పెద్దలు, గ్రామస్థులు.గుడి నిర్మాణం కోసం తక్షణమే ముఖ్య భాగస్తులైన రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి 10 లక్షల రూపాయలను ప్రకటించారు. మిగతా డబ్బులను గ్రామస్థులు, గ్రామ పెద్దల సహకారంతో సేకరిస్తున్నామని తెలిపారు.

## అడ్వొకేట్ రక్షణ చట్టం చాలా ముఖ్యమైంది

**: కేంద్రమంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్**



హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి): ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన చేస్తున్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ అన్నారు. అడ్వొకేట్ రక్షణ చట్టం చాలా ముఖ్యమైందని, దేశంలో లాయర్లు, డాక్టర్లకు చాలా డిమాండ్ ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన.. పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జున్ రామ్‌మేఘ్వాల్ మాట్లాడుతూ.. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద ఇన్సూరెన్స్ తీసుకున్నా.. పరిహారం సరిగా ఇవ్వడంలేదని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కేసులు కూడా సుప్రీంకోర్టులో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచించారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా న్యాయస్థానాల్లో మనం ఎలా వాదిస్తామనేది కీలకం అన్నారు. రానున్న మూడేళ్లు చాల కీలకమైందని, అందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలి అంటే అందరం కలసి కట్టుగా పని చేయాలన్నారు. అర్జున్ రామ్‌మేఘ్వాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ఎంపీ లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## రెండు పడకల ఇండ్ల పట్టాలను పంపిణి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి): గతంలో డబుల్ బెడ్ రూం కేటాయించి కోర్టు కేసులో ఆగిపోయి కోర్టు నుండి క్లియరెన్స్ వచ్చిన చార్మినార్, మలక్ పేట, యాకత్ పురా, చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు సంబంధించిన లబ్ధిదారులకు మినిస్టర్ క్వార్టర్స్ లో డబుల్ బెడ్ రూం పట్టాలు పంపిణీ చేసిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు..జిహెచ్ఎంసి ప్రాంత నివాసితులకు రెండు పడకల ఇళ్ల కేటాయింపు పథకంలో భాగంగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకాల్ గ్రామంలో రెండు పడకల ఇళ్ల నిర్మాణాన్ని జిహెచ్ఎంసి చేపట్టింది. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 1730 మంది లబ్ధిదారుల జాబితాను ప్రచురించారు మంకల్ ఫేజ్ II స్థానంలో రెండు పడకల ఇళ్లను కేటాయించారు. అందులో భాగంగా చార్మినార్, మలక్ పేట, యాకత్ పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.అంబర్ పేట 134,బహదూర్ పుర 294,బండ్లగూడ 155,చార్మినార్ 209, సైదాబాద్ 206 ,ఇతర ప్రాంతాల్లో ఉన్న 28 డబుల్ బెడ్ రూంలలో మొత్తం 1024 మంది లబ్ధిదారుల్లో ఈరోజు మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా 75 మంది పట్టాలు అందుకున్నారు.మిగిలిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేయనున్నారు.

## ఏడుపాయలలో వరద ఉద్ధృతి.. రాజగోపురంలో వనదుర్గామాతకు పూజలు

పాపన్నపేట, అక్టోబర్ 03 (భారత శక్తి): మెదక్ జిల్లా ఏడుపాయలలో మంజీరా నది ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో వన దుర్గామాత ఆలయాన్ని ఆనుకుని భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట నుంచి 1.09లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.





# తెలంగాణలో మద్యం అమ్మకాల రికార్డు.. రెండ్రోజుల్లో రూ. 419 కోట్ల అమ్మకాలు

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి) : దసరా పండుగ, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో తెలంగాణలో మద్యం అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. పండుగకు ముందు కేవలం రెండు రోజుల్లోనే ఏకంగా రూ. 419 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే ఇది భారీ పెరుగుదల అని వారు తెలిపారు. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 30న అత్యధికంగా రూ. 333 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీన మరో రూ. 86 కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. వాస్తవానికి సెప్టెంబర్ 26 నుంచే రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు రెట్టింపైనట్లు అధికారులు పేర్కొన్నారు. నిన్న గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. అదే రోజు దసరా పండుగ కూడా ఉండటంతో, మందుబాబులు ఒకరోజు ముందుగానే పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు. ఈ కారణంగా అక్టోబర్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైన్ షాపులు, లిక్కర్ మార్ట్‌ల వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. పలుచోట్ల మద్యం కోసం జనం బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. పండుగ సీజన్‌తో పాటు డ్రై డే కూడా కలిసి రావడమే ఈ భారీ అమ్మకాలకు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## దామోదర్ రెడ్డి భౌతికకాయానికి రేవంత్ రెడ్డి నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి) : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం దామోదర్ రెడ్డి మృతి చెందారు. ఈరోజు ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు.దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా నివాళులర్పించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ, దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టామని అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఆయనకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, కోలుకుని తిరిగి పార్టీలో క్రియాశీలకంగా ఉంటారని తాము భావించామని అన్నారు. ఆయన మృతి నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు.

## ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది: బిల్ గేట్స్

ఢిల్లీ, అక్టోబర్ 03 (భారత శక్తి) : మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆవిష్కరణల రంగంలో భారత్ ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలుస్తోందని, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా ఉందని ఆయన కొనియాడారు. భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సులేట్ జనరల్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన బిల్ గేట్స్ మాట్లాడుతూ... "ఈ రోజు భారత్ ఆవిష్కరణల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను కాపాడి, మెరుగుపరిచే పరిష్కారాలను అందిస్తోంది. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భారత్‌తో మా భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. గాంధీజీ ఆశయాలైన సమానత్వం, గౌరవం తమ ఫౌండేషన్ పనికి పునాది వంటివని గేట్స్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. వాషింగ్టన్, సియాటిల్ నగర ప్రభుత్వాల నుంచి సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో 'ప్రస్తుత ప్రపంచంలో గాంధీ విలువల ప్రాముఖ్యత' అనే అంశంపై యూఎస్ గ్లోబల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు జొనాథన్ గ్రానోఫ్ ప్రత్యేక ప్రసంగం చేశారు. అంతకుముందు, బెల్వ్యూ పబ్లిక్ లైబ్రరీ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, సియాటిల్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వాషింగ్టన్ స్టేట్ సెనేటర్ వందనా స్లాటర్ పుష్పాంజలి ఘటించారు. సియాటిల్, బెల్వ్యూ నగరాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భారతఅమెరికన్ సమాజం పాల్గొంది. ఈ సందర్భంగా చిన్నారులు గాంధీజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని భారత కాన్సులేట్ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

## ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం... కీలక నిర్ణయాలు ఇవే!

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమంతో పాటు రాజధాని అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు సుమారు 20 అజెండా అంశాలపై కేబినెట్ చర్చించి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి మరింత ఊతమిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

*** ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక అండ**

రాష్ట్రంలోని ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు అండగా నిలుస్తూ రూ. 15,000 ఆర్థిక సాయం అందించే పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గతంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల నుంచి డ్రైవర్లను ఆదుకునే లక్ష్యంతో ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ పథకాన్ని శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. "ప్రతి వర్గాన్ని ఆదుకోవడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సాయం వారి జీవనోపాధికి భరోసా ఇస్తుంది" అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది డ్రైవర్లు లబ్ధి పొందనున్నారు.

*** అమరావతి నిర్మాణానికి కీలక అడుగులు**

రాజధాని అమరావతి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు కేబినెట్ రెండు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. మొదటిది, అమరావతిలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడానికి ఒక ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ ఎస్‌పీవీ ద్వారా నిధుల సమీకరణ, పనుల పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. "అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలంటే ఎస్‌పీవీ ఏర్పాటు ఎంతో అవసరం. ఇది పనుల్లో వేగాన్ని, పారదర్శకతను పెంచుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీంతో పాటు, ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాని మిగిలిన భూములను భూసేకరణ చట్టం ప్రకారం సేకరించేందుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

*** టెక్నాలజీ, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్)' పాలసీ 202429కి సంబంధించిన అనుబంధ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. ఇది ఐటీ, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు, రాష్ట్రంలో పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు 'కారవాన్ టూరిజం' పథకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

*** ప్రధాని పర్యటన, ఇతర నిర్ణయాలు**

ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లపై కూడా కేబినెట్ భేటీలో చర్చించారు. కర్నూలులో జరగనున్న ఎన్‌డీఏ ర్యాలీ, జీఎస్టీ తగ్గింపుపై రాష్ట్రవ్యాప్తంగా 60 వేలకు పైగా అవగాహన సభలు నిర్వహించాలని మంత్రులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు జలవనరుల శాఖ పరిధిలోని పలు పనులకు, అమృత్ 2.0 పథకం కింద 20 మున్సిపాలిటీలలో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలన్నీ 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## తిరుపతిలో హై అలర్ట్... రైల్వే స్టేషన్, బస్టాండులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు


తిరుమల, అక్టోబర్ 03 (భారత శక్తి) : తమిళనాడులో ప్రముఖులకు వచ్చిన బాంబు బెదిరింపుల సెగ తిరుపతిని తాకింది. చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్, నటి త్రిష ఇళ్లకు బెదిరింపు కాల్స్ రాగా... తిరుపతిలోనూ పేలుళ్లకు పాల్పడతామంటూ బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. ఈ నేపథ్యంలో, తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందు జాగ్రత్త చర్యగా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ పరిణామం నగరంలో కాస్త ఉత్కంఠకు దారితీసింది. పోలీసు ప్రత్యేక బృందాలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి తిరుపతి రైల్వే స్టేషన్, లింకు బస్ స్టాండ్, విష్ణునివాసం యాత్రికుల వసతి సముదాయం వంటి ఆరు కీలక ప్రాంతాల్లో సుమారు రెండు గంటల పాటు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి ప్రతి అంగుళాన్ని జల్లెడ పట్టారు. ప్రయాణికుల లగేజీని, అనుమానాస్పదంగా ఉన్న వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకరమైన వస్తువులు గానీ, అనుమానాస్పద కార్యకలాపాలు గానీ గుర్తించలేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నగరంలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేశామని అధికారులు తెలిపారు. శ్రీవారి దర్శనానికి దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

## నాంపల్లిలో అలయ్ బలయ్.. హాజరైన వెంకయ్య, కోమటిరెడ్డి, నాగార్జున, సుజనా చౌదరి

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి) : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ ముగిసిన మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో దత్తాత్రేయ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈరోజు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన అతిథులకు దత్తాత్రేయ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, సినీ నటులు నాగార్జున, బ్రహ్మానందం, ఏపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సీపీఐ నేత నారాయణ, తెలంగాణ జన సమితి నేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హనుమంత రావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, వేష భాషలు వేరైనా మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరం ఐక్యంగా ఉండాలనే సదుద్దేశంతో అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దత్తాత్రేయ గత ఇరవై సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్గం, జాతి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి ప్రయత్నాలు విఫలం కావడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

## హైవేలపై క్యూఆర్ కోడ్ బోర్డులు... స్కాన్ చేస్తే పూర్తి సమాచారం మీ చేతిలో!

ఢిల్లీ, అక్టోబర్ 03 (భారత శక్తి) : జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై హైవేల వెంట క్యూఆర్ కోడ్లతో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం ద్వారా ప్రయాణికులు రహదారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, అత్యవసర సేవలను సులభంగా పొందవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా జాతీయ రహదారి నంబర్, ప్రాజెక్ట్ పొడవు, నిర్మాణ, నిర్వహణ కాలం వంటి వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు హైవే పెట్రోలింగ్, టోల్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్ వంటి అధికారుల ఫోన్ నంబర్లు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 1033 కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా, సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజాకు ఉన్న దూరం, ట్రక్కుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, పంక్చర్ షాపులు, వాహన సర్వీస్ స్టేషన్లు, ఈ-ఛార్జింగ్ స్టేషన్ల వివరాలను కూడా ఈ కోడ్ ద్వారా పొందవచ్చని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ప్రయాణికులకు సులభంగా కనిపించేలా ఈ బోర్డులను టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాలు, రహదారి ప్రారంభ, ముగింపు పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ విధానం రహదారి భద్రతను పెంచడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందిస్తుందని, జాతీయ రహదారులపై అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్‌హెచ్ఏఐ తన ఆస్తుల మానిటైజేషన్ ద్వారా 2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 35,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్ల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా (ICRA) ఒక నివేదికలో అంచనా వేసింది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ. 24,399 కోట్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని, బడ్జెట్ లక్ష్యమైన రూ. 30,000 కోట్లను కూడా అధిగమిస్తుందని తెలిపింది.




## ఆటో డ్రైవర్ ఘరానా మోసం.. వృద్ధుడి ఫోన్ కాజేసి.. బ్యాంకు ఖాతా ఖాళీ

హైదరాబాద్: ఓ ఆటో డ్రైవర్.. వృద్ధ ప్రయాణికుడిని మభ్యపెట్టి సెల్‌ఫోన్ దొంగిలించాడు. మరో ఇద్దరితో కలిసి అతడి బ్యాంకు ఖాతాలో డబ్బును కొల్లగొట్టాడు. హైదరాబాద్‌కు చెందిన 68 ఏళ్ల వృద్ధుడు ఉప్పల్ నుంచి ఆటోలో ప్రయాణించాడు. ఆటో దిగే సమయంలో డిజిటల్ పేమెంట్ చేయాలని ఆటో డ్రైవర్ కోరాడు. వృద్ధుడు అతను కోరినట్టే డబ్బు చెల్లించాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న బాలానగర్ వాసి మహ్మద్ మోహినుద్దీన్, మహ్మద్ సయ్యద్ సల్మాన్ వృద్ధుడిని మాటల్లో పెట్టగా.. ఆటో డ్రైవర్ బాధితుడి ఫోన్ అపహరించాడు. తన ఫోన్ పోయినట్టు మరుసటి రోజు గుర్తించిన బాధితుడు.. అందులో ఉన్న సిమ్ బ్లాక్ చేయించాడు. అనంతరం తన బ్యాంకు ఖాతా పరిశీలించగా.. రూ.1.95లక్షలు మాయమైనట్లు తెలుసుకొని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు.. కాజేసిన డబ్బును నిందితులందరూ కలిసి పంచుకున్నట్టు గుర్తించారు.

## జీటో కనెక్ట్2025 ఎగ్జిబిషన్.. ప్రారంభించిన కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి) : విద్య, వ్యాపార రంగాల్లో జైన సమాజం పాత్రను కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశంసించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీటో) కనెక్ట్ 2025 ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రకృతి వనరులు సంక్షోభంలో ఉన్న ఈ రోజుల్లో జైన తత్వం నియంత్రణ మార్గాన్ని చూపిస్తుందన్నారు. ఆధ్యాత్మికత, వ్యాపార రంగం, విద్య, సంస్కృతి కలిసి జైన సమాజం గరిష్ఠ స్థాయిలో ఎదగడానికి ఈ జీటో కనెక్ట్ వేదికగా మారిందన్నారు. ప్రపంచానికి ప్రేరణగా వాణిజ్యం, సాంస్కృతిక భావం, ఆధ్యాత్మికత, సమాజ సేవ లక్ష్యాలను కలిపి రూపొందించిన ఒక సమగ్ర



ఈవెంట్‌గా ఆయన అభివర్ణించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విలువలతో కూడిన వృద్ధికి చిరునామాగా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, యోగా గురువు రాందేవ్ బాబా హాజరయ్యారు.

# అమాయకుల ప్రాణాలు తీస్తున్న ధనదాహం..

**దేవుడు జన్మనిస్తాడు..కానీ వైద్యుడు మరుజన్మను ఇస్తాడు.. అలాంటి వైద్య రంగానికి చెందిన, అనుసంధానమైన మందుల తయారీ కంపెనీలు మానవత్వంతో కాకుండా దుర్మార్గంతో వ్యాపారం చేస్తున్నాయి.. ఒక మెడిసిన్ మార్కెట్ లోకి రావాలంటే ఎన్నెన్నో పరిశోధనలు జరగాలి.. అవి క్లినికల్ గా నిరూపితం అయినప్పుడే వాటిని మార్కెట్ లోకి అనుమతి ఇస్తారు.. ఈ క్లినికల్ ట్రయల్స్ అనేవి ఒక పద్ధతి ప్రకారం, నిపుణుల పర్యవేక్షణలో జరగాలి.. ఒక మెడిసిన్ ని ఒక వ్యక్తిమీద ప్రయోగిస్తున్నప్పుడు అతనితో, అతని కుటుంబ సభ్యులతో అవగాహన ఒప్పందం చేసుకోవాలి.. పొరబాటున ఏదైనా జరిగితే బాధ్యత ఆ మెడికల్ కంపెనీ తీసుకోవాలి.. అంతేకాకుండా తాము ట్రయల్స్ కు వినియోగించే మెడిసిన్ ని నిపుణులు, ప్రభుత్వం ఆమోదించాలి.. కానీ అది ఇప్పుడు జరగడం లేదు.. అనుమతులు లేని మెడిసిన్ ను కూడా క్లినికల్ ట్రయల్స్ కు వినియోగిస్తున్నారు... ఇది చాలా పెద్ద నేరం.. కానీ సదరు మెడికల్ కంపెనీ యాజమాన్యం వీటన్నిటినీ పట్టించుకోవడం లేదు.. ప్రభుత్వాలను, అధికారులను చివరికి కుటుంబసభ్యులను కూడా డబ్బుతో కొనేస్తోంది.. ట్రయల్స్ లో ఏదైనా ప్రమాదం జరిగితే వారు చూపించే మరణాల సంఖ్య తప్పుగా ఉంటోంది.. వేల సంఖ్యలో మరణాలు వ్యాపిస్తున్నా, వాటిని వెలుగులోకి రానీయడం లేదు.. ఇదంతా దేని కోసం..? అక్రమ సంపాదన కోసమే కదా..? సంపాదించిన కోట్ల పైకం పోయేటప్పుడు వెంటేసుకుని పోతారా..? ఒక్కసారి ఈ మెడికల్ మాఫియా, రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు ఆలోచించాలి.. దీనిపై అలుపెరుగని పోరాటం చేస్తోంది.." ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..**



**(స్పెషల్ కరస్పాండెంట్)**

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి) : మెడికల్ మాఫియా అని పిలుచుకునే పదం అనధికారికంగా, లాభాల కోసం వైద్య రంగంలో జరుగుతున్న అవినీతి, దోపిడీ, నైతిక ఉల్లంఘనలను సూచిస్తుంది. ఇందులో క్లినికల్ ట్రయల్స్ దుర్వినియోగం, అనవసరమైన మందుల వినియోగం, రోగులపై లాభాపేక్షతో చేసే చికిత్సలు వంటి అంశాలు కూడా ఉంటాయి.

*** అసలు మెడికల్ మాఫియా అంటే ఏమిటి? :**

"మెడికల్ మాఫియా" అనేది వైద్య రంగంలో ఉన్న కొన్ని ఆసుపత్రులు, ఔషధ కంపెనీలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కొంతమంది డాక్టర్లు కలసి చేసే అనైతిక వ్యాపారానికి పెట్టిన పేరు. వీరి ప్రధాన లక్ష్యం రోగి ఆరోగ్యం కంటే లాభం.

*** కొన్ని ప్రధానమైన పద్ధతులు :**

రోగులకు అవసరం లేని టెస్టులు, స్కాన్లు చేయించడం.. తక్కువ ఖర్చులో చికిత్స సాధ్యమైనా, ఖరీదైన మందులు లేదా ఆపరేషన్లు సూచించడం.. ఔషధ కంపెనీలతో చేతులు కలిపి, కమిషన్ కోసం మందులు రాయడం.. పేద, అమాయకులైన రోగులపై అనుమతి లేకుండా క్లినికల్ ట్రయల్స్ చేయడం.. లాంటివి జరుగుతూ వున్నాయి..

*** దుర్వినియోగం అవుతున్న క్లినికల్ ట్రయల్స్ :**

క్లినికల్ ట్రయల్ అంటే కొత్త మందు లేదా ట్రీట్మెంట్ ని మానవులపై పరీక్షించడం. ఇది శాస్త్రీయంగా అవసరం.. కానీ చాలా సందర్భాల్లో దుర్వినియోగం జరుగుతుంది. ఈ దుర్వినియోగం రకరకాల పద్ధతుల్లో జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం.. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలపై సరైన సమాచారం లేకుండా పరీక్షలు చేయడం.. ప్రభుత్వం నుంచి, సంబంధిత డిపార్ట్మెంట్ నుంచి అనుమతి ఉందంటూ నకిలీ అనుమతి పత్రాలు సృష్టించడం చేస్తున్నారు.. ఈ ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఏవైనా సమస్యలు వస్తే వారు బాధ్యత తీసుకోకపోవడం జరుగుతోంది..ఇక ట్రయల్స్ పేరు మీద మానవ హక్కులు ఉల్లంఘించడం కూడా జరుగుతోంది.. ఉదాహరణకు తీసుకుంటే కొన్ని ఔషధ కంపెనీలు భారత్‌లో పేద పిల్లలపై వ్యాక్సిన్ ట్రయల్స్ చేశాయి, మరణాలు జరిగినా సరైన విచారణ జరగలేదు.



*** నిపుణులు, మేధావులు కొన్ని నివారణ మార్గాలు సూచిస్తున్నారు..**

మెడికల్ మాఫియా, క్లినికల్ ట్రయల్స్ దుర్వినియోగాన్ని నియంత్రించడానికి పౌరులు, మీడియా, ప్రభుత్వం అందరూ చర్యలు తీసుకోవాలి.. మరీ ముఖ్యంగా ప్రజల అత్యంత జాగ్రత్త వహించాలి.. ఏ ఆసుపత్రి నుంచైనా వైద్య సూచనలు పొందినప్పుడు రెండవ అభిప్రాయం అంటే సెకండ్ ఒపీనియన్ తప్పక తీసుకోవాలి.. మరో డాక్టర్ ను సంప్రదించాలి.. అదే విధంగా చికిత్స వివరాలు, మందుల వివరాలు రాతపూర్వకంగా అడిగి తీసుకోవాలి..

మీమీద ఎవరైనా ట్రయల్స్ చేయాలనుకుంటే దాని గురించిన పూర్తి వివరాలు, దానివల్ల వచ్చే రిస్కులు అంటే కష్టనష్టాలు సంపూర్ణంగా తెలుసుకోవాలి.. ఇక మీడియా అలాగే స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్రను పోషించగలగాలి.. ఇలాంటి ఘటనలను ఎలాంటి ఆలోచన లేకుండా బహిర్గతం చేయాలి.. అలాగే రోగుల హక్కుల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చేయాలి..


*** ప్రభుత్వ చర్యలు కఠినంగా ఉండాలి :**

భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మాఫియా కార్యకలాపాలను అరికట్టడానికి కొన్ని చట్టాలు, నియంత్రణ వ్యవస్థలను తీసుకొచ్చాయి.. వాటిలో ముఖ్యమైన చట్టాలు, నియమాలు ఇలా ఉన్నాయి..

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్, 1940.. ఇందులో కొత్త ఔషధాల క్లినికల్ ట్రయల్స్‌పై కఠిన నియమాలు అమలుచేశాయి.. ఐ.సి.ఎం.ఆర్. గైడ్ లైన్స్ ఇది మానవులపై పరిశోధనలకు నైతిక నియమావళి రూపొందించింది.. ఇక సి.డీ.ఎస్.సి.ఓ. అంటే సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ అనేది క్లినికల్ ట్రయల్స్ అనుమతి, పర్యవేక్షణ బాధ్యత తీసుకుంటుంది..

ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి..అవి ఏమిటంటే అనుమతి లేకుండా ట్రయల్స్ చేస్తే జైలు శిక్ష, భారీ జరిమానాలు విధించడం..అలాగే సంబంధిత ఆసుపత్రులు, మెడికల్ కంపెనీల లైసెన్స్ రద్దు చేయడం..ప్రత్యేక నైతిక కమిటీ అంటే ఎథిక్స్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతి ట్రయల్ పర్యవేక్షణ నిర్వహించడం..

అయితే రికార్డుల్లో, జీవోల్లో ఇవి నిక్షిప్తమై వున్నాయి.. వాస్తవరూపంలో అమలు అవుతున్నాయా అన్నది అనుమానాస్పదమే




అంటున్నారు విశ్లేషకులు.. ప్రభుత్వం నైతిక బాధ్యత వహించకపోతే చాలా ప్రాణాలు పోతాయి.. ఒక హత్య చేస్తే న్యాయస్థానాలు కఠినమైన శిక్షలు విధిస్తున్నాయి.. మరి ఇవి కూడా హత్యలతో సమానమే కదా..? మరెందుకు స్పందించడం లేదన్నది విశ్లేషకుల ప్రశ్న...?

చివరకి మెడికల్ మాఫియా అనేది ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడే అత్యంత ప్రమాదకరమైన వ్యవస్థ. ఇది కేవలం ప్రభుత్వమే కాకుండా, ప్రజల అవగాహన, మీడియా బాధ్యత, వైద్యుల నైతికత ద్వారా మాత్రమే నియంత్రించవచ్చు. ప్రతి పౌరుడు తన హక్కులు తెలుసుకొని, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే హెల్త్ డిపార్ట్మెంట్ లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " సూచిస్తోంది..



## ఫలక్ నుమా ఆర్వోబీని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి): జీహెచ్ఎంసీ నిధులు రూ 52.03 కోట్ల వ్యయంతో నిర్మించిన సికింద్రాబాద్ ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్‌లోని ఫలక్‌నుమా వద్ద ఆర్ఓబీకి సమాంతర ఆర్ఓబీనీ శుక్రవారం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్,ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్, మీర్ జుల్ఫికర్ అలీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

*** ఆర్వోబీ ప్రారంభంతో... ఫలక్ నుమాలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు**

పాతబస్తీ ఫలక్ నుమాలో నేటి నుంచి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సికింద్రాబాద్ నుంచి ఫలక్ నుమా బ్రాడ్ గేజ్ లైన్ వద్ద ఉన్న ఆర్వోబీకి సమాంతరంగా జీహెచ్ఎంసీ ఆర్వోబీని నిర్మించింది. రూ.52.కోట్లతో 4 వరుసల్లో ఆర్వోబీని జీహెచ్ఎంసీ నిర్మించింది. పాత ఆర్వోబీని పునరుద్ధరించడంతో పాటు దానికి సమాతరంగా మరో ఆర్వోబీని నిర్మించడంతో బార్కస్ జంక్షన్ నుంచి ఫలక్ నుమా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి. సమయం ఆదాతోపాటు గంటల తరబడి నిలిచిపోయే ట్రాఫిక్ నుంచి ఊరట లభించనుంది. ఫలక్‌నుమా ఆర్ఓబీనీ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# న్యాయమైన విచారణలో న్యాయాధికారి పాత్ర

**(స్పెషల్ కరస్పాండెంట్) :**

హైదరాబాద్, అక్టోబర్ 03 (భారత శక్తి) : న్యాయాధికారి కేవలం మౌన వీక్షకుడిగా కోర్టులో కూర్చోరాదు. ఆయన పాత్ర చురుకైనది, ఉద్దేశపూర్వకమైనది, సత్యాన్ని వెలికితీయడం, న్యాయం జరగడం, ఎవ్వరూ తప్పుచేయకుండా శిక్షించబడకూడదనే నిబంధనను కాపాడడం. న్యాయమైన విచారణ అంటే, నిందితుడికి తనపై వచ్చిన ప్రతికూల సాక్ష్యాలను వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వడం తప్పనిసరి. కోర్టు లక్ష్యం కేవలం "నిందితుడు ఏమి చేశాడు" అనే విషయాన్నే గమనించడం కాదు..ఆయన "ఎందుకు చేశాడు?", "ఏ ఉద్దేశ్యం లేదా లాభం కోసం చేశాడు?" అన్నదాన్ని కూడా అన్వేషించాలి. ఎందుకంటే ఒక చర్య వెనుక ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం వల్లే నిజం వెలుగులోకి వస్తుంది, తొందరపాటు లేదా అన్యాయ తీర్పులు నివారించబడతాయి.

*** న్యాయాధికారికి అధికారం ఇచ్చిన చట్టపరమైన నిబంధనలు :**

1. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 313 నిందితుడి విచారణ ప్రాసిక్యూషన్ సాక్ష్యాలను సమర్పించిన తర్వాత, కోర్టుకు ఒక తప్పనిసరి కర్తవ్యం ఉంది, నిందితుడిని వ్యక్తిగతంగా ప్రశ్నించడం ఇది ప్రమాణం లేకుండా జరగాలి.. ఈ ప్రక్రియ ద్వారా నిందితుడు తనపై ఉన్న ప్రతికూల సాక్ష్యాలను తన మాటల్లో వివరణ ఇవ్వగలడు. దీని ఉద్దేశ్యం అతనికి న్యాయంగా తనను తాను రక్షించుకునే సమాన అవకాశం ఇవ్వడం.
2. భారతీయ సాక్ష్యాధికార చట్టం సెక్షన్ 165 న్యాయాధికారి ప్రశ్నించే అధికారం ఈ సెక్షన్ ప్రకారం న్యాయాధికారి ఎప్పుడైనా, ఏ సాక్షినైనా, నిందితుడిని కూడా ప్రశ్నించ వచ్చు. దీని ఉద్దేశ్యం ప్రాసిక్యూషన్ లోపాలను పూడ్చడం కాదు, నిజాన్ని వెలికితీయడం.. న్యాయం సాధించడం. ఈ అధికారం విస్తృతమైనది, కానీ ఎల్లప్పుడూ న్యాయమైన పద్ధతిలో, హక్కులను రక్షించే విధంగా వినియోగించాలి.




**సత్యాన్వేషణ :**

విచారణ కేవలం ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదనల పోటీ కాదు. న్యాయాధికారి చురుకైన పాత్ర వల్ల విచారణ న్యాయ సత్యాన్వేషణ దిశగా నడుస్తుంది. కోర్టు బాధ్యత నేరస్థులను శిక్షించడం మాత్రమే కాదు, నిజమైన న్యాయం జరిగేలా చూడడం కూడా.

*** న్యాయమైన విచారణ, న్యాయం :**

నిందితుడికి ప్రతికూల సాక్ష్యాలపై వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వడం, "విన్నవించక శిక్ష విధించరాదు" అనే న్యాయ సూత్రానికి ప్రతిబింబం. ఈ విధానం.. తప్పుడు శిక్షలు పడకుండా కాపాడుతుంది.. నిందితుడి వైపు నుంచి ఉపశమన అంశాలను బయటకు తెస్తుంది.. ప్రజల్లో కోర్టులపై నమ్మకాన్ని పెంచుతుంది.

*** ప్రస్తుత పరిస్థితి – న్యాయ సూత్రాల పతనం :**

చట్టం ఈ విధంగా భరోసా కల్పించినప్పటికీ, నేటి రోజుల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అనేక న్యాయాధికారులు ఈ నిబంధనలను సరైన రీతిలో అమలు చేయడం లేదు. క్రైమ్ పీసీ. సెక్షన్ 313, ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 165 వంటి అధికారాలను ఉపయోగించకుండా, చాలామంది మౌన వీక్షకులుగా మారిపోయారు.

*** తీవ్రమైన ఫలితాలు కలుగుతున్నాయి :**

పౌర హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి, ఎందుకంటే నిందితులకు వివరణ ఇచ్చే హక్కు దూరమవుతోంది. న్యాయపరమైన పొరపాట్లు జరుగుతున్నాయి, నిరపరాధులు కూడా శిక్షపడే పరిస్థితి వస్తోంది. న్యాయాధికారుల జవాబుదారీతనం తగ్గిపోతోంది, కోర్టులపై ప్రజల విశ్వాసం దెబ్బతింటోంది.

**ముగింపు :**

న్యాయవ్యవస్థ ఉద్దేశం దోషులను శిక్షించడం ఎంత ముఖ్యమో, నిరపరాధులను రక్షించడం అంతే ముఖ్యమైంది. సీఆర్ పీసీ సెక్షన్ 313, ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 165 వంటి నిబంధనలు కేవలం ప్రొసీజర్ ఫార్మాలిటీలు కావు.. ఇవి రాజ్యాంగ హామీలతో కూడిన న్యాయ భరోసాలు. ఈ నిబంధనలను న్యాయాధికారులు పాటించకపోతే, న్యాయం యొక్క పునాది కదిలిపోతుంది, పౌరుల హక్కులు ఉల్లంఘనకు గురవుతాయి. కాబట్టి న్యాయాధికారులు తమ చురుకైన పాత్రను పునరుద్ధరించి, ధైర్యం, ధర్మబద్ధతతో నడుచుకొని, రాజ్యాంగ న్యాయ సూత్రాలను కాపాడాలి..

**- డా. బాల**
**సైకాలజిస్టు – సామాజిక – రాజకీయ ఇంజినీర్**

# పేదోడి చాయ్ బండ్లను దోచుకుంటున్న చిల్లర దొంగలు



ఎల్బీనగర్, అక్టోబర్ 03 (భారత శక్తి): వారానికి రెండు చాయ్ బండ్లు టార్గెట్...దొంగ సంపాదనకు అలవాటు పడి రెక్కాడితే గానీ డొక్కాడని పేద బతుకులు వారివి.. అప్పో సప్పో చేసి రోడ్ల పక్కన జీవనోపాధి కోసం చాయ్ బిస్కెట్లు అమ్ముకునే వారి బండ్లను అర్ధరాత్రి సమయంలో ముఖాలు గుర్తుపట్టకుండా ముసుగులు ధరించి చాయ్ డబ్బాల తాళాలను పగులగొట్టి వేల రూపాయల సామాన్లు దోచుకొని రోడ్లపైన బతికే పేదల కడుపు కొడుతున్నారు. కొందరు దొంగలకు ఇదే అలవాటుగా మారి ఎల్బీ నగర్ నుండి దిల్ సుఖ్ నగర్ వరకు రెండు వైపులా రోడ్ల వెంట డబ్బాలు పెట్టుకుని బతుకుతున్న పేదవారి చాయ్ డబ్బాల తాళాలు పగులగొట్టి అందిన కాడికి సిగరెట్ డబ్బాలు, సిలెండర్లు, విలువైన గిన్నెలు దోచుకొని ఎంచక్కా వెళ్లిపోతున్నారు.చిన్న చిన్న దొంగతనాలే కదా అని దుకాణ యజమానులు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడం లేదు.. గిరాకీ వదిలిపెట్టి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగే సమయం లేక ఫిర్యాదు వరకు వెళ్లడం లేదు. కానీ పోలీస్ సిబ్బంది ఇప్పటికైనా వీరిని పట్టుకుని దొంగతనాలకు స్వస్తి పలికేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.